విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :76 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 6 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## మౌలిక సదుపాయాలు విస్తరించాయి

- ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ ప్రజల జీవితాల్లో చాలా మార్పులు వచ్చాయి
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత- జమ్మూకశ్మీర్ విద్య, వైద్యం, వ్యాపార, క్రీడా రంగాలు మెరుగయ్యాయ్
- ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపార, క్రీడలు వంటి రంగాల్లో అవకాశాలు

## నిరసనల వేళ పోలీసులు సంయమనం పాటించాలి

- యువతపై కఠినంగా వ్యవహరించడం సరికాదు
- మార్చ్ టూ పార్లమెంట్ విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- రాళ్లు విసిరిన యువతపై కఠినంగా వ్యవహరించడం సరికాదని వ్యాఖ్య
- విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి, వారి సమస్యను వినాలన్న సుప్రీం
- యువత హింసకు పాల్పడకుండా ఉండేలా మనం జాగ్రత్తగా వ్యవహరించాలి



# అపోహలు వద్దు



- గోదావరి నది వెంబడి ఏ స్నాన ఘట్టంలో పుష్కర స్నానం ఆచరించినా పుణ్యం లభిస్తుంది
- భక్తుల్లో విశ్వాసాన్ని కల్పించేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేయాలన్న సీఎస్ జి.సాయి ప్రసాద్
- ఇకపై పుష్కరాల ఏర్పాట్లపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష
- 2027 గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

**అమరావతి**

రానున్న 2027 గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. గోదావరి నది వెంబడి ఏ స్నాన ఘట్టంలోనైనా పుణ్యస్నానం ఆచరించవచ్చనే విస్తృత అవగాహనను కల్పించేలా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. అందులో భాగంగా ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి.సాయి ప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు. గోదావరి పుష్కరాలపై సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. "స్నానం – దానం – పితృతర్పణం" వంటి నినాదంతో వివరాలు 2లో..



## జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ భారత్‌లో అంతర్భాగమే

- భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు పాక్ దుష్ప్రచారం
- దాయాదికి కేంద్రం చురకలు
- జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగమేనని వ్యాఖ్యానించిన జైస్వాల్
- భారత్‌పై ఆరోపణలు చేయడం కంటే ముందుగా పీఓకేలో జరుగుతున్న రక్తపాతాన్ని ఆపాలని సూచన

# విశాఖ సమగ్రాభివృద్ధికి మైక్రో ప్లానింగ్

- వీఈఆర్ ప్లానింగ్ కోసం ఆంధ్రా యూనివర్సిటీ సేవలు
- విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికల సమీక్షలో సీఎం చంద్రబాబు
- వీఈఆర్ పరిధిలో మొత్తంగా రూ. 9.50 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం
- బేసిటీ ప్రాజెక్టును యాంకర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం



**అమరావతి**

విశాఖ ఎకనమిక్ రీజియన్ సమగ్రాభివృద్ధికి సూక్ష్మ స్థాయి ప్రణాళికలను రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ రీజియన్ పరిధిలోని అన్ని ప్రాంతాలను, అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకుంటూ పూర్తి స్థాయి అభివృద్ధి ప్రణాళిక చేయాలని సూచించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో విశాఖ ఎకనమిక్ రీజియన్ - వీఈఆర్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం సమీక్షించారు. విశాఖ రీజియన్ పరిధిలో కొత్త ప్రాజెక్టులు.. సీఆర్జెడ్ రీ-క్లాసిఫికేషన్, వైజాగ్ బే సిటీ, బే-సిటీ అథారిటీ ఏర్పాటు వంటి అంశాలపై సీఎం సమీక్షించారు. వీఈఆర్ పరిధిలో మొత్తంగా రూ. 9.50 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చేందుకు వివరాలు 2లో..

## చంద్రబాబు పాలన రైతులకు హానికరం

- పొగాకు రైతులను వెంటనే ఆదుకోవాలి
- వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలి
- తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో పర్యటించిన మాజీ సీఎం వైయస్ జగన్



**దేవరపల్లి**

రైతులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. అధికారంలోకి రాగానే రైతులకు రెట్టింపు సాయం చేస్తాం అని చంద్రబాబు చెప్పి అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేశారని ధ్వజమెత్తారు. తీవ్ర ప్రతికూల పరిస్థితుల మధ్య నష్టపోతున్న పొగాకు రైతులతో స్వయంగా మాట్లాడేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో పర్యటించారు. స్థానిక పొగాకు కొనుగోలు కేంద్రం సందర్శించిన ఆయన, కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖిలో పాల్గొన్న ఆయన, పొగాకు పంట సాగు, గిట్టుబాటు ధర, కొనుగోళ్లు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర వివరాలు ఆరా తీశారు. రైతుల సమస్యలు, ఇబ్బందులపై వారితో నేరుగా చర్చించిన వైయస్ జగన్, అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ ఏం మాట్లాడారంటే..: అన్నింటా విధ్వంసం. ప్రశ్నిస్తే అరెస్టులు. ఈ 26 నెలల చంద్రబాబునాయుడు పాలనలో ఈరోజు అన్ని వర్గాలు నష్టపోయిన పరిస్థితులు కనిపిసాయి. ఈరోజు చంద్రబాబు పరిపాలన లో ఏం జరుగుతోంది అంటే, విద్య, వైద్యం, వ్యవసాయం, వివరాలు 2లో..

## యువతపై జరిగిన హింసకు అమిత్ షానే బాధ్యుడు

- విద్యార్థులకు సంబంధించి ఏం జరిగిందో పార్లమెంటులో వివరించే ధైర్యం ఆయనకు లేదని విమర్శలు
- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- రాజ్యాంగం కోసం పోరాడి, భారతదేశ భావనను పరిరక్షించిన వేలాది మంది విద్యార్థులను చూసి గర్వంగా ఉంది
- తమ భవిష్యత్తు కోసం, న్యాయమైన పరీక్షా విధానం కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలపడంలో ఎలాంటి తప్పులేదు






## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లేవ్

- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల కోసం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు లేవు
- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టత- బిల్లులపై రాహుల్ గాంధీతో చర్చలు
- 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు

## బీసీలకు చట్టంతో రక్షణ

- దేశంలోనే మొదటి సారి బీసీ రక్షణ చట్టం ఏపీలోనే
- మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు, పార్థసారథి
- బీసీ ముసాయిదా రక్షణ చట్టం జాతీయ బీసీ కమిషన్ దృష్టికి తీసుకెళతాం
- కేంద్ర ప్రభుత్వ సహకారంతో వీలైనంత త్వరగా బీసీ రక్షణ అమలయ్యేలా చర్యలు



**అమరావతి**

బీసీ రక్షణ చట్టంతో వెనుబడిన వర్గాలు గౌరవ ప్రదంగా సామాజిక జీవనం కొనసాగించేలా రక్షణ కల్పిస్తున్నామని, కులం, వృత్తుల పేరుతో దూషిస్తే కఠినంగా శిక్షించేలా చట్టం రూపొందిస్తున్నామని మంత్రులు ఎస్.సవిత, అచ్చెన్నాయుడు, పార్థసారథి తెలిపారు. ఈ చట్టంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల అభిప్రాయాలు తీసుకున్నామని, వివరాలు 2లో..

# మౌలిక సదుపాయాలు విస్తరించాయి



2019లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత నుంచి జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ ప్రజల జీవితాల్లో విస్తృతమైన మార్పులు వచ్చాయని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం అన్నారు. ఇరు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణతోపాటు విద్య, వైద్యం, వ్యాపార, క్రీడా రంగాల్లో అవకాశాలు ఎంతో మెరుగయ్యాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసి ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ ప్రాంతాల అభివృద్ధికి, అక్కడ ఉన్న ప్రతి పౌరుడికి పెద్ద కలలు కనే, వాటిని సాధించే, వికసిత్ భారత్ నిర్మాణంతో తమ వంతు సహకారం అందించే అవకాశం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారంటూ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. "ఏడేళ్ల క్రితం ఇదే రోజున, ఆర్టికల్ 370, ఆర్టికల్ 35(ఞా) చరిత్రగా మారిపోయాయి. ఇది జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ ప్రస్థానంలో ఒక నిర్ణయాత్మకమైన కొత్త అధ్యాయాన్ని లిఖించింది. అప్పటి నుంచి జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ ప్రజల జీవితాల్లో విస్తృతమైన మార్పులు వచ్చాయి. మౌలిక సదుపాయాలు విస్తరించాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపార, క్రీడలు వంటి రంగాల్లో అవకాశాలు పెరిగాయి. భారత రాజ్యాంగం అక్కడ పూర్తిగా అమలు కాకపోవడం వల్ల, దశాబ్దాలుగా ప్రాథమిక రాజ్యాంగ హక్కులకు నోచుకోని మహిళలు, వెనుకబడిన వర్గాల ప్రజలు ఇప్పుడు సాధికారత సాధించారు."

**కశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు**

2019 ఆగస్టు 5వ తేదీన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్?కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్? 370ని రద్దు చేసింది. ఆ తర్వాత ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్ధాఖ్? అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. ఈ నేపథ్యంలోనే మోదీ తన ఎక్స్? పోస్టులో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. "ఈ సంవత్సరం ఆగస్టు 5వ తేదీకి మరింత ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే ఈ సంవత్సరమే మన దేశం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని జరుపుకుంటోంది. జాతీయ ఐక్యత పట్ల ఆయన జీవితకాల నిబద్ధత తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. దశాబ్దాల క్రితం ఆయన ఊహించినది 2019 ఆగస్టు 5న నెరవేరింది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి పూర్వరూపమైన 'భారతీయ జనసంఘ్?' వ్యవస్థాపకుడే శ్యామా ప్రసాద్ ముఖర్జీ. ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్మూకశ్మీర్?ను పూర్తిగా భారతదేశంలో విలీనం చేయాలని ఆయన పోరాడారు. 1906 జులై 6న జన్మించిన ఆయన, 1953 జూన్? 23న శ్రీనగర్?లో గృహ నిర్బంధంలో ఉన్న సమయంలో కన్నుమూశారు.

**కశ్మీర్ పురోగమిస్తోంది!**

మరోవైపు జమ్మూకశ్మీర్ ప్రాంతం ప్రస్తుతం పురోగమనంలో ఉందని కేంద్రం చెబుతోంది. శ్రీనగర్ వారసత్వానికి (హెరిటేజ్?) అంతర్జాతీయ గుర్తింపు లభించడం, రికార్డు స్థాయిలో అక్కడకు పర్యటకులు వస్తుండడం, హస్తకళల వృద్ధి ఇందుకు నిదర్శనమని పేర్కొంది. కశ్మీర్ సంస్కృతి, సంప్రదాయాలను, అక్కడి ప్రకృతి అందాలను చూడడానికి ప్రపంచ నలుమూలల నుంచి సందర్శకులు వస్తున్నారని చెబుతోంది. "శ్రీనగర్ యునెస్కో క్రియేటివ్ సిటీ, వరల్డ్ క్రాఫ్ట్ సిటీ అనే ప్రతిష్ఠాత్మక టైటిల్స్‌ను దక్కించుకుంది. ఇది కశ్మీర్ కాలాతీత హస్తకళా నైపుణ్యాన్ని వేడుకగా జరుపుకుంటూ, దాని కళాత్మక వారసత్వాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్తోంది" అంటూ పీఐబీ ఇండియా తన ఎక్స్?లో ఓ పోస్టు పెట్టింది. 2026లో యాభై లక్షల మందికి పైగా భక్తులు వైష్ణోదేవిని సందర్శించారని, 4 లక్షల మందికిపైగా యాత్రికులు అమరనాథ్? యాత్రను పూర్తి చేశారని పేర్కొంది. ఇది ప్రజల్లోని విశ్వాసానికి ప్రతీక అని, ఈ విధంగా జమ్మూకశ్మీర్?లో ఆధ్యాత్మిక పర్యాటకం విలసిల్లుతోందని స్పష్టం చేసింది.

# నిరసనల వేళ పోలీసులు సంయమనం పాటించాలి



జులై 20న జరిగిన 'మార్చ్ టు పార్లమెంట్' ఆందోళనల సందర్భంగా తలెత్తిన ఉద్రిక్తతలపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల వేళ పోలీసులు, భద్రతా బలగాలు సంయమనం పాటించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. రాళ్లు విసిరిన యువతపై కఠినంగా వ్యవహరించడం సరికాదని పేర్కొంది. పార్లమెంట్ వైపు దూసుకొచ్చిన వారిపై పోలీసులు తగిన జవాబుదారీతనం ప్రదర్శించలేదని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. ఇలాంటి పరిస్థితులను ఎలా అదుపు చేయాలో పోలీసులకే బాగా తెలుసన్న ధర్మాసనం, శాంతియుత నిరసనలను ప్రోత్సహించాలని, పరిస్థితి చేయిదాటకుండా చూడాలని పేర్కొంది. ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తే సామాజికంగా హింస మరింత పెరుగుతుందన్న ధర్మాసనం, నిరసనకారుల సమస్యలను విని శాంతియుత మార్గాలను ప్రోత్సహించాలని సూచించింది. ఇదే అంశంపై నిర్వాహకులపై చర్యలు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ప్రధాన పిటిషన్‌తో ధర్మాసనం జత చేసింది.

"శాంతియుత ర్యాలీని ప్రోత్సహించడం ముఖ్యం. ఆందోళనల వేళ పోలీసులు, భద్రతా బలగాలు సంయమనం పాటించాలి. రాళ్లు విసిరిన యువతపై కఠినంగా వ్యవహరించవద్దు. యువత హింసకు పాల్పడకుండా ఉండేలా మనం జాగ్రత్తగా వ్యవహరించాలి. కౌన్సెలింగ్ ఇచ్చి శాంతింపజేయడమే ప్రభుత్వాల బాధ్యత. నిరసనకారుల సమస్యను వినడమే బలమైన ఆయుధం. ప్రభుత్వం వైపు నుంచి దూకుడు ప్రదర్శిస్తే సామాజికంగా హింస మరింత పెరుగుతుంది. దారితప్పిన మూకలు రాళ్లు రువ్వినా యువతను శాంతింపజేయడానికే చూడాలి. యువతకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. యువత నిరసనలకు కారణాలను వినడమే అత్యంత శక్తిమంతమైన సాధనం. ప్రభుత్వం నుంచి వచ్చే తీవ్ర ప్రతిస్పందన సమాజంలో మంటలను మరింత పెంచుతుంది. వారి మాటలు వినండి, వారు ఎందుకు నినాదాలు చేస్తున్నారో అర్థం చేసుకోండి. అయితే, ఈ విషయాన్ని చట్టాన్ని అమలు చేసే సంస్థల విచక్షణకే వదిలేద్దాం. ఇలాంటి పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో వారికి మనకంటే బాగా తెలుసు."

అంతకుముందు నిర్వాహకులపై చర్యలు కోరుతూ మనీష్ కుమార్ సోలంకి దాఖలు చేసిన పిటిషన్?పై ఆయన తరఫున న్యాయవాది రిజ్వాన్ అహ్మద్ హాజరై వాదించారు. "15 రోజులు గడిచిపోయాయి. మరి నిర్వాహకుల జవాబుదారీతనం సంగతేంటి? వారు ఒక ఛానల్ నుంచి మరో ఛానల్‌కు వెళ్తూ రెచ్చగొట్టే ప్రకటనలు ఇస్తున్నారు. ఈ ఉద్రిక్తతలను చల్లార్చడానికి నిరాకరిస్తున్నారు. నిన్న రాజస్థాన్‌లో రాళ్ల దాడి జరిగింది. ఇది చాలా ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీస్తుంది. రాజస్థాన్?లో జరిగిన నిరసనల్లో ఒక యువకుడు మరణించాడు. జాతీయ రాజధానికి సంబంధించిన విషయంలో ప్రభుత్వం అతిగా వెనక్కి తగ్గితే, అది రాజస్థాన్‌లో ఒక ఉదాహరణగా నిలవదా? అక్కడ కూడా విద్యార్థులకు అనుకూలంగా ప్రభుత్వం వెనక్కి తగ్గుతోంది. లఖ్?నవూలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏదైనా డిమాండ్‌తో బస్సులపై రాళ్లు రువ్వడం ప్రారంభిస్తే, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కూడా వెనక్కి తగ్గుతుందా?" అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తప్పుడు వైఖరి అనుసరించిందన్న ఏకైక కారణంతో, రాళ్లు రువ్విన వారిని ఎలాంటి పరిశీలన లేకుండా శిక్ష నుంచి తప్పించకూడదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. "ఇది చాలా ప్రమాదకరమైన ఆనవాయితీ. మూడేళ్ల క్రితం రైతులు సింఘూ సరిహద్దు వద్ద ఇలానే చేశారు. రేపు ఆల్ఫా, బీటా, గామా, డెల్టా తరాల వారు వస్తారు. సింఘూ సరిహద్దులోని ప్రజలు ట్రాక్టర్లతో పార్లమెంటుకు వస్తారు. అక్కడ అనుమతి లేదు, పైగా నిర్వాహకులు 22 షరతులను ఉల్లంఘించారు. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటు వైపు నిరసనకారులు ర్యాలీగా వెళ్లడం సరికాదు. ఒకవేళ 500 మంది పార్లమెంటులోకి ప్రవేశించి ఉంటే, వారి వద్ద నాటు తుపాకులు లేదా నాటు బాంబులు లేవని ఎవరికి తెలుసు? ఒకవేళ వారు కాల్పులు జరిపి ఉంటే పరిస్థితి ఏమయ్యేది? వారు జాతీయ రహదారిపై, రైల్వే లైన్?పై ర్యాలీ చేయలేదు. వారు ప్రజాస్వామ్య దేవాలయం వైపు ర్యాలీగా వెళ్లారు. దీనికి అందరూ బాధ్యత వహించాలి." అని న్యాయవాది అన్నారు.

నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ జూలై 20న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) 'సంసద్ మార్చ్'ను చేపట్టింది. మార్చ్ సందర్భంగా రాళ్ల దాడి ఘటనలు జరగడంతో పోలీసులు ప్రతిచర్యలకు దిగారు. ఈ క్రమంలోనే పలువురు నిరసనకారులు, భద్రతా సిబ్బంది గాయపడ్డారు.

# జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ భారత్‌లో అంతర్భాగమే



జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టు 5వ తేదీని దోపిడీ దినోత్సవంగా పాటించేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాన్ని? భారత్? తీవ్రంగా ఖండించింది. ఇది ముమ్మాటికి భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు పాక్? చేస్తున్న దుష్ప్రచారమేనని విదేశాంగ శాఖ పేర్కొంది. ఇలాంటి ప్రయత్నాలతో అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని పాక్? యత్నిస్తోందని మండిపడింది. అయితే, భారత్‌పై ఆరోపణలు చేయడం కంటే ముందుగా పీఓకేలో జరుగుతున్న రక్తపాతాన్ని ఆపాలని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్?ధీర్ జైస్వాల్ సూచించారు. అలాగే పాక్? భూభాగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉగ్రవాద సంస్థలపై శాశ్వత చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా, ఆక్రమణలో ఉన్న భారత భూభాగాలన్నింటినీ తక్షణమే ఖాళీ చేయాలని వ్యాఖ్యానించారు.

మీడియాతో బుధవారం మాట్లాడిన జైస్వాల్, పాకిస్థాన్?కు చురకలంటించారు. జమ్మూకశ్మీర్, లద్ధాఖ్? కేంద్ర పాలిత ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగమేనని ఉద్ఘాటించారు. గతంలోనూ అవి భారత్‌లో భాగమేనని, భవిష్యత్తులో కూడా అలాగే కొనసాగుతాయని నొక్కి చెప్పారు. భారత ప్రభుత్వం 2019 ఆగస్టు 5న, జమ్మూకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక హోదాను రద్దు చేసి, ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లడఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఆగస్టు 5ను 'యౌమ్-ఎ-ఇస్తేహ్సాల్'గా పాకిస్థాన్ పాటిస్తూ వస్తోంది. అలాగే, ఏడేళ్ల క్రితం దిల్లీ తీసుకున్న చర్య దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వాలను నెలకొల్పే ప్రయత్నాలను క్లిష్టతరం చేసిందని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వ్యాఖ్యానించారు. అందుకు బదులుగా రణ్‌ధీర్ జైస్వాల్ ఘాటుగా స్పందిస్తూ, పాక్? చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, వాటిని భారత్ పూర్తిగా తిరస్కరిస్తోందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన 2019లో చేసిన రాజ్యాంగపరమైన మార్పులు పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో వ్యాఖ్యానించే అర్హత పాక్?కు లేదని గట్టిగా చెప్పారు. అయితే భారత ప్రభుత్వ నిర్ణయాల వల్ల అక్కడ ప్రజలకు గతంతో పోలిస్తే మెరుగైన పరిపాలన, సామాజిక, ఆర్థిక అభివృద్ధిని, సుపరిపాలనను, ప్రజాస్వామ్య సాధికారతను అందించాయని తెలిపారు.

**ప్రజలపై పాక్ అణచివేత**

పాకిస్థాన్ తన దేశంలోని 'ప్రస్తుత పరిస్థితిని, మానవ హక్కుల రికార్డును, ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా తనకున్న స్థితి' నుంచి ప్రపంచం దృష్టిని మళ్లించేందుకు భారత్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తోందని రణ్?ధీర్? జైస్వాల్? పేర్కొన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఇటీవల నిరసనకారులపై పాకిస్థాన్ జరిపిన చర్యను ఆయన ప్రస్తావించారు. పీఓకేలో శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలపై పాక్? బలగాలు తీవ్ర అణచివేతకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. నిరసనకారులను అణిచివేయడానికి వారిపై కాల్పులు జరపడం, కఠిన ఆంక్షలు విధించడం వంటి చర్యలు అక్కడి వాస్తవ పరిస్థితిని అంతర్జాతీయ సమాజం చూస్తోందని తెలిపారు.

కాగా, జూన్ నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనలపై పాక్? దళాలు జరిపిన అణచివేతలో కనీసం 90 మంది ప్రాణాలు కోల్పోయారని, సాధారణ పౌరులపై ప్రభుత్వ బలగాలు హింసకు పాల్పడటం పాకిస్థాన్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని జైస్వాల్? పేర్కొన్నారు. అంతకుముందు కూడా పీఓకే పౌరులపై పాక్ ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తోందని భారత్ మండిపడింది. అంతర్జాతీయ సమాజం దీన్ని గమనించి పాక్‌ను జవాబుదారీ చేయాలని పిలుపునిచ్చింది. పీవోకేలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జులై 27 నుంచి జరుగుతున్న సైన్యం దాడుల్లో 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని ఇటీవల దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రణధీర్ జైస్వాల్? పేర్కొన్నారు. పీవోకేలోని ప్రజలను పాక్ రక్షణశాఖ మంత్రి శత్రువులుగా అభివర్ణించారని, ఆ తర్వాతే వారిపై సైన్యం దాడుల్ని తీవ్రం చేసిందని వ్యాఖ్యానించారు.


## యువతపై జరిగిన హింసకు అమిత్ షానే బాధ్యుడు

కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. నిరసన చేస్తున్న యువతపై జరిగిన హింసకు అమిత్ షానే బాధ్యుడని దుయ్యబట్టారు. విద్యార్థులకు సంబంధించి ఏం జరిగిందో పార్లమెంటులో వివరించే ధైర్యం ఆయనకు లేదని విమర్శించారు. పేపర్ లీకేజీల సమస్యపై నిరసన తెలిపిన విద్యార్థులను కలిసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. రాజ్యాంగం కోసం పోరాడి, భారతదేశ భావనను పరిరక్షించిన వేలాది మంది విద్యార్థులను చూసి గర్వంగా ఉందన్నారు. తమ భవిష్యత్తు కోసం, న్యాయమైన పరీక్షా విధానం కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలపడంలో ఎలాంటి తప్పులేదని, విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడం నేరం కాదన్న రాహుల్, దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీవ్రంగా స్పందించారు.

"యువ నిరసనకారులతో మేము స్వేచ్ఛగా మాట్లాడాం. తమపై దాడి చేశారని, కొట్టారని, బెదిరించారని వారు నాతో చెప్పారు. నాకు వారిని చూసి చాలా గర్వంగా ఉంది. వారు చేసిన పనికి, అలాగే వారిలాగే వేలాది మంది యువ భారతీయులు చేసిన పనికి నేను చాలా గర్విస్తున్నాను. వారు రాజ్యాంగాన్ని కాపాడారు, 'భారతదేశం' అనే భావనను రక్షించారు, భారతదేశ భవిష్యత్తును కాపాడారు. లోపభూయిష్టంగా, కుప్పకూలే స్థితిలో, నిరుపయోగంగా ఉన్న విద్యావ్యవస్థపై ఫిర్యాదు చేయడం ఏమాత్రం నేరం కాదు. ఒకవేళ ఏమైనా చేయాల్సి ఉంటే, ఆ వ్యవస్థను మార్చాలి, సరిదిద్దాలి. వారు కోరింది కూడా సరిగ్గా అదే. వారు ఎలాంటి హింసకూ పాల్పడలేదు, దూకుడుగా ప్రవర్తించలేదు, అసభ్యంగా నడుచుకోలేదు. కానీ వారిపై దాడి చేశారు, కొట్టారు, బెదిరించారు. మహిళల ఇళ్లకు గుండాలను పంపడం, 15 ఏళ్ల చిన్నారిని బలవంతం చేసి క్షమాపణలు చెప్పించడం, ఆపై ఆ క్షమాపణను అంగీకరించడం పక్కా మూర్ఖత్వం. దాన్ని మేము అంగీకరించం. సరిగ్గా పనిచేసే విద్యావ్యవస్థ మాకు కావాలి. ప్రశ్నాపత్రాల లీకేజీలు ఆగాలి. ఈ దేశ భవిష్యత్తు అయిన ఈ యువతను గౌరవించాలి, రక్షించాలి. మీ అందరినీ చూసి నేను ఎంతగానో గర్విస్తున్నాను. ఈ పని చేసిన ప్రతి ఒక్క యువకుడిని చూసి గర్విస్తున్నాను. మీరు ఎలాంటి తప్పూ చేయలేదు. ఇక మీరు క్షమాపణ చెప్పాలనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. మీరు ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు, ఎందుకంటే మీరు ఏ తప్పూ చేయలేదు."

"యువతిపై పెల్లెట్ గన్‌తో కాల్పులు జరిపిన వ్యక్తి. కొన్ని రోజుల క్రితం నేను మీడియా ముందు ఉంచిన యువకుడిపై పెల్లెట్ గన్‌తో కాల్పులు జరిపిన వ్యక్తి. అలాగే ఈ యువతికి వ్యతిరేకంగా పోలీసు యంత్రాంగాన్ని ఉసిగొల్పిన వ్యక్తి అమిత్ షానే. ఆయనే భారతదేశ హోం మంత్రి. ఆయన (షా) పార్లమెంటుకు రావాల్సిన కనీస మర్యాద కూడా పాటించడం లేదు. జరిగిన ఘటనపై స్పందించే కనీస మర్యాద, ధైర్యం ఆయనకు లేవు. ఇందులో రెండు అవకాశాలు ఉన్నాయి: ఒకటి, పిల్లలపై హింస జరిగిందన్న విషయం ఆయనకు తెలియకపోవచ్చు. అలా అయితే ఆయన అసమర్థుడు అనుకోవాలి. రెండోది యువతపై పెల్లెట్ గన్ కాల్పులు జరపాలని, హింసను ప్రేరేపించాలని ఆయనే ఆదేశించి ఉండవచ్చు. అలా అయితే ఆయన బాధ్యుడు (నేరస్థుడు) అవుతారు. ఏది ఏమైనప్పటికీ, దీనికి ఆయనే బాధ్యుడు." అని రాహుల్ గాంధీ అన్నారు. సమర్థంగా పనిచేసే విద్యా వ్యవస్థ ఉండాలని, పరీక్షా పత్రాల లీకేజీలు ఆగిపోవాలని, అలాగే భవిష్యత్తును గౌరవించి కాపాడాలని గాంధీ పిలుపునిచ్చారు.

## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లేవ్






పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారంటూ వస్తున్న వార్తలకు కేంద్ర ప్రభుత్వం తెరదించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై (నియోజకవర్గాల పునర్విభజన) చర్చించేందుకు ఆగస్టు 16- 18 తేదీల్లో స్పెషల్ సెషన్ నిర్వహించానున్నారనే ప్రచారాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. అలాంటి ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని ఆయన బుధవారం రాత్రి స్పష్టం చేశారు. అదే విధంగా ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలను పొడిగించే అవకాశాలు కూడా లేవని రిజిజు వెల్లడించారు. ప్రస్తుత పార్లమెంట్ మాన్సూన్ సెషన్ జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు కొనసాగనుంది. ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఆగస్టు 13నే ఇవి ముగియనున్నాయని రిజిజు వెల్లడించారు. ఈ సమావేశాల్లో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లును, అలాగే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన డీలిమిటేషన్ బిల్లులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే రిజిజు దీనిపై క్లారిటీ ఇచ్చారు.

**ప్రతిపక్షాలతో సంప్రదింపులు**

బిల్లుల ఆమోదం కోసం ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌తో పాటు ఎన్డీఏ మిత్రపక్షాలతో ప్రభుత్వం సంప్రదింపులు ప్రారంభించింది. ఈ క్రమంలోనే కిరణ్ రిజిజు బుధవారం రోజు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కలిశారు. ఇక్కడ రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రాతో వారి ఛాంబర్‌లో దాదాపు 50 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు రిజిజు ప్రయత్నించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కానీ ఈ అంశంపై కాంగ్రెస్ నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ లభించలేదని సమాచారం. ప్రభుత్వం ఇదే అంశంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, డీఎంకే నాయకత్వంతో కూడా చర్చలు జరపాలని భావిస్తోంది. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును తిరిగి ప్రవేశపెట్టే అవకాశాలపై పార్టీల అభిప్రాయాల్ని తెలుసుకోవాలని చూస్తోంది.

**డీలిమిటేషన్‌తో పెరగనున్న లోక్‌సభ స్థానాలు**

2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. అలాగే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత లోక్‌సభ స్థానాల సంఖ్య 816 కి పెరిగే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. గతంలో కూడా ఈ బిల్లుల ఆమోదం కోసం కేంద్రం ప్రయత్నాలు చేసినప్పటికీ అప్పట్లో తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో ముందుకు సాగలేదు. ప్రస్తుతం ప్రతిపక్షాలతో చర్చల ద్వారా బిల్లుల ఆమోదానికి ప్రభుత్వం మార్గం సుగమం చేసుకోవాలని చూస్తోంది.

ఇదిలా ఉండగా, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు- 2026 ను (ఖీజ=ూా) ఆమోదింపజేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లు విదేశీ నిధులు స్వీకరించే సంస్థల పర్యవేక్షణ, ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రద్దయిన సంస్థల ఆస్తుల నిర్వహణకు కొత్త విధానాల్ని ప్రతిపాదిస్తోంది. రిజిస్ట్రేషన్ రద్దైన సంస్థల విదేశీ నిధులు, ఆస్తుల్ని పర్యవేక్షించేందుకు ఒక డిజిగ్నేటెడ్ అథారిటీని ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. సదరు సంస్థలు నిర్ణీత వ్యవధిలో నిబంధనలు పాటించి రిజిస్ట్రేషన్ పునరుద్ధరించుకుంటే ఆస్తులు వెనక్కి వస్తాయి. లేదంటే ఆ ఆస్తులు పూర్తిగా అథారిటీ పరిధిలోకి వెళ్తాయి. ఉల్లంఘనలకు సంబంధించి విధించే గరిష్ఠ జైలు శిక్షను ఐదేళ్ల నుంచి ఒక సంవత్సరానికి తగ్గించడం, దర్యాప్తు సంస్థలు ముందస్తు అనుమతి తీసుకోవడం వంటి మార్పుల్ని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. మార్చి 25న ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా ఇప్పుడు దీనిని ఆమోదింపజేసుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగియడానికి ఇంకా కొన్ని రోజుల సమయం ఉండటంతో ప్రత్యేక సెషన్ అవసరం లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ప్రతిపక్షాల నిరసనల కారణంగా పార్లమెంట్ కార్యకలాపాలు తరచుగా వాయిదా పడుతూనే ఉన్నాయి. బిల్లులు చర్చ లేకుండానే ఆమోదం పొందుతున్నాయన్న విమర్శలకు ప్రతిస్పందించిన కిరణ్ రిజిజు, ఇందుకు ప్రతిపక్షాలే కారణమని ఆరోపించారు.

# అమరావతిలోనే మంత్రులు.. నివాసాలు రెడీ!



**హైదరాబాద్ :** ఏపీ రాజధాని అమరావతిలో రెండు కీలక నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిని ఈ నెల 13న సీఎం చంద్రబాబు స్వయంగా ప్రారంభించనున్నారు. వీటిలో 1) సీడ్ యాక్సస్ రోడ్డు నిర్మాణం. ఇది 90 శాతం నిర్మాణం పూర్తయింది. అమరావతి నిర్మాణాలు ప్రారంభమైన నాటి నుంచే నిర్మాణం చేపట్టినా.. మధ్యలో కొందరు రైతులు భూములు ఇవ్వలేదు. దీంతో ఈ నిర్మాణంలో ఆలస్యం జరిగింది. అయితే.. ఇటీవల భూ సేకరణ ద్వారా వాటిని తీసుకున్నారు. దీంతో నిర్మాణాలు వడివడిగా ముందుకు సాగుతున్నాయి. జరుగుతున్న పనులు జరుగుతుండగానే.. ఇప్పటికే పూర్తయిన 90 శాతం సీడ్ యాక్సస్ రహదారిని సీఎం చంద్రబాబు ఈ నెల 13న ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ట్రయల్ రన్‌ను కూడా ప్రారంభించారు. మొత్తంగా 6 గ్రామాలను కవర్ చేస్తూ నిర్మించిన.. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు .. అమరావతికి తలమానికంగా నిలిచింది. ఇది అందుబాటులోకి రావడంతో అమరావతి నిర్మాణంలో కీలక ఘట్టం పూర్తయినట్టేనని అంటున్నారు.ఇక, రాష్ట్ర మంత్రివర్గం మొత్తం అమరావతిలోనే నివాసం ఉండేలా ప్లాన్ చేశారు. దీనికి సంబంధించి కూడా.. నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇండివిద్యువల్‌గా 3 స్టార్ రేటింగ్‌తో ఈ నివాసాల నిర్మాణాలను పూర్తి చేశారు. ఇటీవల ప్రారంభించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా రెండు రోజుల్లో పూర్తి కానున్నాయి. వీటిని కూడా ఈ నెల 13నే సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. అనంతరం.. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కి వీటిని బదలాయిస్తారు.జీఏడీఅధీనంలో ఉండే ఈ మంత్రుల నివాసాలను ప్రాధాన్యాల వారీగా మంత్రులకు కేటాయిస్తారు. తద్వారా.. మంత్రులు పూర్తిసమయం అమరావతిలోనే ఉండనున్నారు. మొత్తం రాష్ట్ర మంత్రివర్గంలో 26 మంది మంత్రులు ఉన్నారు. వీరికి అనుకూలంగా 3 స్టార్ రేటింగ్‌తో ఆధునిక వసతులతో ఈ భవనాలను నిర్మించారు. 26 నివాసాలతో పాటు.. అతి పెద్ద పార్కులు, స్విమ్మింగ్ పూల్స్, ఆట స్థలాలు, ఎమ్యూజ్‌మెంటు పార్కులు, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రాంతాలను నిర్మించారు. అలానే మరో 8 ప్రత్యేక నివాసాలను కూడా ఏర్పాటు చేశారు. వీటిని గెస్టులకు కేటాయించేలా ప్లాన్ చేయడం గమనార్హం.

# ఏపీలో డిప్లమెటిక్ పాలిటిక్స్...

**విజయవాడ, ఆగస్టు 5 :**
రాజకీయాల్లో నాయకులకు వ్యక్తిగత అహం, సిద్ధాంత భేషజాలు ఉండటం సాధారణం. అయితే, ప్రజాస్వామ్యంలో అధికారం దక్కినప్పుడు వ్యక్తిగత ఆత్మగౌరవం కంటే తన్ను నమ్మి ఓటేసిన కోట్ల మంది ప్రజల ప్రయోజనాలు, రాష్ట్ర పునరుద్ధరణే ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పరిపాలనా శైలి ద్వారా స్పష్టం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఆయన పదే పదే ప్రశంసించడం, వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో మోదీ నాయకత్వాన్ని బలపరచడంపై రాజకీయ ప్రత్యర్థులు, నెటిజన్లలో కొంత మంది విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ.. ఆ విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా చంద్రబాబు ముందుకు సాగుతున్నారు.పైకి కనిపించే ఈ ప్రశంసలు వెనుక అత్యంత పటిష్టమైన కోఆపరేటివ్ ఫెడరలిజం వ్యూహం దాగి ఉందని అనుకోవచ్చు. 2024లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీ ఆర్థికంగా, పరిపాలనాపరంగా తీవ్ర సంక్షోభంలో మునిగిపోయింది. రాష్ట్ర బడ్జెట్ లోటు, అప్పుల భారం, నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణం, అటకెక్కిన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాలంటే కేంద్ర ప్రభుత్వ పూర్తి స్థాయి మద్దతు, ప్రత్యక్ష ఆర్థిక నిధుల కేటాయింపు అత్యంత ఆవశ్యకం. ఈ క్రమంలో కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయిని రాబట్టుకోవడం చంద్రబాబు అనుసరిస్తున్న వ్యూహాత్మక రాజకీయ లౌక్యం.ఈ లౌక్యానికి తగ్గ ఫలితాలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ సాయంతో పాటు కేంద్రం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు, గ్రాంట్లు విడుదల చేయడం, పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఆమోదం తెలపడం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వంటి కీలక పురోగతులు కేంద్ర–రాష్ట్రాల మధ్య ఉన్న సానుకూల సంబంధాల వల్లే సాధ్యమయ్యాయి. ప్రధాని మోదీకి, కేంద్ర కేబినెట్‌కు పదే పదే కృతజ్ఞతలు చెప్పడం ద్వారా చంద్రబాబు కేంద్ర నిధుల ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా మార్గం సుగమం చేసుకుంటున్నారు.మరోవైపు, ప్రతిపక్షాల విమర్శల నరేటివ్‌ను గమనిస్తే.. గతంలో 2018లో ధర్మపోరాటం పేరుతో మోదీపై చంద్రబాబు చేసిన ఘాటు విమర్శల వీడియోలను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ రాజకీయ ఆత్మవంచన గా అభివర్ణించే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ, 2019 నుండి 2024 వరకు కేంద్రంతో విభేదించి రాష్ట్రం సాధించిందేమీ లేదని, తీవ్రంగా నష్టపోయిందని గ్రహించిన చంద్రబాబు.. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న రాజకీయ పరిపక్వతను ప్రదర్శిస్తున్నారు. కేంద్రంతో ఘర్షణ వైఖరి కంటే చర్చలు–లబ్ధి విధానమే ఏపీకి మేలనే స్పష్టమైన అంచనాతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో ఈ సఖ్యత కేవలం నిధులకే పరిమితం కాకుండా.. విశాఖ–రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే జోన్ పనులు వేగవంతం కావడం, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యాసంస్థలకు కేంద్ర గ్రాంట్లు పెరగడం, కొత్త పారిశ్రామిక కారిడార్ల కేటాయింపుల్లో ఏపీ ప్రాధాన్యత పెరగడం వంటి దీర్ఘకాలిక లాభాలను తెచ్చిపెడుతోంది. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో.. ఆ రాజకీయ ప్రభావాన్ని వ్యక్తిగత ఇమేజ్ కంటే రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి ఇంధనంగా వాడుకోవడమే చంద్రబాబు బ్రాండ్ డిప్లొమసీగా అనుకోవచ్చు. విమర్శలను స్వీకరిస్తూనే, వాటిని అధిగమించి అమరావతి సమగ్ర నిర్మాణం, పోలవరం పూర్తి, పరిశ్రమల తరలింపు ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రాథమిక లక్ష్యమని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. విమర్శకులు సెటైర్లు వేసినా, సోషల్ మీడియాలో మీమ్స్ వచ్చినా.. రాష్ట్రానికి చేకూరే నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులే రేపటి రోజున తమ సమర్థతకు నిదర్శనంగా నిలుస్తాయని ఆయన విశ్వసిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ అహాన్ని పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా చంద్రబాబు నాయుడు నడుపుతున్న ఈ డిప్లొమాటిక్ పాలిటిక్స్ ఏపీ రాజకీయ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయంగా భావిస్తున్నారు.

# కేసుల్లో నేతలు... కిం కర్తవ్యం...

**విజయవాడ, ఆగస్టు 5**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మాజీ మంత్రులు, కీలక నేతలు వరుసగా క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని ముందస్తు బెయిళ్ల కోసం హైకోర్టు మెట్లు ఎక్కడం లేదా అజ్ఞాతంలోకి వెళ్లడం ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారింది. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూకబ్జా, డెత్ సర్టిఫికెట్ల ఫోర్జరీ కేసుల విచారణ నెదుర్కొనడం, గుంటూరు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కిడ్నాప్ వివాదంలో చిక్కుకోవడం, మహిళా ఎస్ఐపై దౌర్జన్యం ఆరోపణలతో ఆముదాలవలస ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్ అజ్ఞాతంలోకి వెళ్లడం వంటి వరుస ఘటనలు విపక్షాన్ని తీవ్ర ఆత్మరక్షణలో పడేశాయి.ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. ఆర్కే రోజా, కైలే అనిల్ కుమార్, విశ్వేశ్వర్ రెడ్డి వంటి కీలక నాయకులు సైతం రకరకాల క్రిమినల్ కేసులు, అరెస్టు భయంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని, వైఎస్సార్‌సీపీ నేతలను భయాందోళనకు గురిచేసేందుకే పోలీసులు, యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ అబద్ధపు కేసులు బనాయిస్తున్నారని పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. అయితే, ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న కేసులు ఎక్కువగా రాజకీయాలకు సంబంధం లేనివి. భూక్రమబద్ధీకరణ పత్రాల ఫోర్జరీ, బ్రతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చూపించడం , సివిల్ తగాదాల్లో అపహరణలు , ఆన్–డ్యూటీ మహిళా పోలీసులపై భౌతిక దౌర్జన్యాలు వంటి తీవ్రమైన నాన్–బెయిలబుల్ క్రిమినల్ కేసులు .గత ఐదేళ్ల పాలనలో నియోజకవర్గాల్లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన నాయకులు, ప్రభుత్వం మారిన తర్వాత కూడా తమ పాత ధోరణినే కొనసాగించడం. స్థానిక అధికార యంత్రాంగంపై భౌతిక దాడికి దిగడం లేదా చట్టవ్యతిరేక భూ లావాదేవీలలో భాగస్వాములు

కావడం ద్వారా స్వయంగా కూటమి ప్రభుత్వానికి లీగల్ ఆధారాలను అందించి ఉచ్చులో చిక్కుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అదే సమయంలో సానుభూతి కోసం వైఎస్సార్‌సీపీ ఎంచుకున్న వ్యూహాత్మక రాజకీయ బాధితులుగా నిలిచే స్ట్రాటజీ కూడా కావొచ్చని భావిస్తున్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నామని, ప్రభుత్వం కావాలనే కేసులు పెడుతోందని ప్రజల్లో చూపించుకోవడం ద్వారా రాజకీయంగా మైలేజ్ పొందే ప్రయత్నం జరుగుతోందనే అభిప్రాయం ఉంది. అయితే, సివిల్ వివాదాలు, వ్యక్తిగత క్రిమినల్ ఆరోపణలు ఉన్న కేసుల్లో ఈ పొలిటికల్ విక్టిమ్ కార్డ్ సరిగ్గా పనిచేయదన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. సామాన్య ప్రజలు భూకబ్జాలు, కిడ్నాప్ కేసులను పొలిటికల్ వెండ్రెట్టాగా చూడటానికి సిద్ధంగా లేకపోవడమే వైఎస్సార్‌సీపీ నరేటివ్‌కు అతిపెద్ద అడ్డంకిగా మారిందని అంటున్నారు. ఈ వరుస అరెస్టులు, ముందస్తు బెయిళ్ల కొట్టివేత పరిణామాలు వైఎస్సార్‌సీపీ కేడర్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. నియోజకవర్గ

స్థాయిలో నడిపించే ప్రధాన నాయకులే రోజులు, వారాల తరబడి అజ్ఞాతంలోకి వెళ్లడం లేదా కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటంతో స్థానిక శ్రేణుల్లో నాయకత్వ శూన్యత ఏర్పడుతోంది. ద్వితీయ శ్రేణి నాయకులు కనీసం నిరసన ప్రదర్శనలు చేసేందుకు కూడా వెనకడుగు వేసేలా ఈ చట్టపరమైన చర్యలు మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ తన డిఫెన్సివ్ మైండ్‌సెట్ నుండి బయటపడటం అత్యంత క్లిష్టంగా మారనుంది. చట్టబద్ధమైన నేరాలకు, రాజకీయ కక్షసాధింపు చర్యలకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో వైఎస్సార్‌సీపీ లీగల్, మీడియా విభాగాలు విఫలమవుతున్నాయని స్పష్టమవుతోంది. సరైన క్రిమినల్ రక్షణ ప్రణాళికలు లేకుండా, అధిష్ఠానం ఇచ్చే రాజకీయ హామీలను మాత్రమే నమ్ముకుని క్షేత్రస్థాయిలో దూకుడు ప్రదర్శిస్తున్న ఇన్‌ఛార్జ్‌లు చివరకు న్యాయపరమైన సంక్షోభంలో మునిగిపోతున్నారన్న అభిప్రాయం ఎక్కువగా ఆ పార్టీలో వినిపిస్తోంది.

# విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా...

**నెల్లూరు, ఆగస్టు 5 :**
ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా ఆలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు.దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్–జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్–జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజయసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయి రాజకీయంలో...సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయం అంశాలను పొందుపరిచారట. యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలా పార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు, విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట.ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి.

## దక్షిణ కోస్తా అభివృద్ధికి కొత్త అక్షమా?

**గుంటూరు, ఆగస్టు 5 :** దక్షిణ కోస్తా అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు నీటి వనరులు, వ్యవసాయం, పోర్టులు, పారిశ్రామిక అవకాశాల గురించి ఎంత చెప్పినా, గత దశాబ్దంలో ఈ ప్రాంత భవిష్యత్తుపై అత్యధిక చర్చకు దారితీసిన అంశం మాత్రం అమరావతి . అయితే అమరావతి గురించి జరిగిన చర్చల్లో చాలా వరకు రాజకీయ వాదోపవాదాలే ప్రధానంగా నిలిచాయి. అభివృద్ధి కోణంలో దాని పాత్ర ఏమిటి? ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఎంత? అనే ప్రశ్నలు మాత్రం చర్చకు రాకుండా ఇప్పటికీ ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. రాజధాని అంటే కేవలం శాసనసభ, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం కాదు. పరిపాలన, విధాన రూపకల్పన, పెట్టుబడులు, విద్య, వైద్యం, సేవారంగం, సాంకేతిక రంగాలు పరస్పరం అనుసంధానమయ్యే కేంద్రం. ప్రపంచంలోని అనేక ప్రణాళికాబద్ధ నగరాల అనుభవం కూడా ఇదే విషయాన్ని చెబుతోంది.ఒక సమర్థవంతమైన రాజధాని తన సరిహద్దులకే అభివృద్ధిని పరిమితం చేయకుండా, చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థిక కార్యకలాపాలకు కూడా కొత్త ఊపును అందించగలగాలి. ఆ కోణంలో చూస్తే, అమరావతి విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కొలవడం సరైన ప్రమాణం కాదు. ప్రభుత్వ సంస్థలు ఎంత స్థిరంగా పనిచేస్తున్నాయి? ప్రైవేట్ పెట్టుబడులను ఎంతవరకు ఆకర్షించగలిగింది? సేవారంగం ఎంత విస్తరించింది? విద్యా, వైద్య సంస్థలు ఎంత వేగంగా అభివృద్ధి చెందాయి? నైపుణ్యాధారిత ఉద్యోగాలకు ఎంత మేర అవకాశాలు సృష్టించబడ్డాయి?... ఈ ప్రశ్నలే అమరావతి అభివృద్ధి విలువను నిర్ణయిస్తాయి.ఒక రాజధాని నగరం నిర్మాణం అంటే ప్రభుత్వ కార్యాలయాలను ఒక చోటుకి తరలించడం మాత్రమే కాదు. ఒకచోట కేంద్రీకృతం చేయడమే కాదు. పరిపాలనా వ్యవస్థ స్థిరపడిన చోట నిర్ణయాల వేగం పెరుగుతుంది. ప్రభుత్వ శాఖలు, నియంత్రణ సంస్థలు, న్యాయవ్యవస్థ, ప్రజా సేవలకు సంబంధించిన అనేక సంస్థలు ఒకదానితో మరొకటి సమన్వయంతో పనిచేసే అవకాశం ఏర్పడుతుంది. దాని ప్రభావం క్రమంగా ప్రభుత్వ వ్యవస్థను దాటి ప్రైవేట్ పెట్టుబడులు, సేవారంగం, ఉపాధి అవకాశాల వరకు విస్తరిస్తుంది. అందుకే ఒక రాజధాని నగర విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కాదు; అక్కడ ఏర్పడిన సంస్థల బలంతో కొలవాలి.దక్షిణ కోస్తా అభివృద్ధి కథలో అమరావతి ఒక ప్రత్యేక అధ్యాయం. దీనిని కేవలం ప్రభుత్వ కార్యాలయాల సమాహారంగా చూస్తే దాని పూర్తి విలువ అర్థం కాదు. ఒక రాజధాని నగరం పరిపాలనకు కేంద్రంగా మారవచ్చు. కానీ విద్య, వైద్యం, పరిశోధన, సాంకేతికత, సేవారంగం కలిసినప్పుడే అది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను కొత్త దిశగా నడిపిస్తుంది. సుమారు 217 చదరపు కిలోమీటర్ల (దాదాపు 53,700 ఎకరాల) రాజధాని నగర ప్రాంతం దీర్ఘకాలిక దృష్టితో రూపొందించబడింది.పరిపాలనతో పాటు నివాసం, విద్య, ఆరోగ్యం, వ్యాపారం, పరిశోధన, సేవారంగం పరస్పరం అనుసంధానమయ్యే నగర నమూనాను ఇది లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్ దృష్టిలో క్వాంటమ్ వ్యాలీ ప్రతిపాదన అమరావతిని క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డీప్ టెక్నాలజీ, ఆధునిక పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇక అనుసంధానం కూడా అంతే కీలకం. సుమారు 189 కిలోమీటర్ల ప్రతిపాదిత అమరావతి ఔటర్ రింగ్ రోడ్ విజయవాడ--గుంటూరు--తెనాలి పట్టణ సముదాయాన్ని విస్తృత ప్రాంతీయ ఆర్థిక వలయంగా అనుసంధానించే సామర్థ్యాన్ని కలిగి ఉంది.అదే విధంగా ప్రతిపాదిత విజయవాడ--అమరావతి మెట్రో కారిడార్ (సుమారు 35--38 కి.మీ.) విద్య, ఉపాధి, సేవారంగాన్ని మరింత దగ్గర చేసే పట్టణ రవాణా వ్యవస్థగా రూపుదిద్దుకుంటోంది. అయితే అమరావతి విజయాన్ని భవనాల సంఖ్య నిర్ణయించదు. విద్యార్థులను ఆకర్షించే విశ్వవిద్యాలయాలు, ప్రపంచస్థాయి వైద్య సేవలు, పరిశోధన సంస్థలు, స్టార్టప్ ఎకోసిస్టమ్, నాలెడ్జ్ ఎకానమీ, వాటిని కలిపే రవాణా వ్యవస్థ---ఇవన్నీ కలిసినప్పుడే అది ప్రాంతీయ అభివృద్ధి కేంద్రంగా నిలుస్తుంది.ఏ ప్రాంతమైనా శాశ్వత అభివృద్ధిని సాధించాలంటే భౌతిక మౌలిక సదుపాయాలు మాత్రమే సరిపోవు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు సమాంతరంగా ఎదగాలి. అలాంటి వ్యవస్థ ఏర్పడినప్పుడే స్థానిక యువతకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందడంతోపాటు, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రతిభ, పెట్టుబడులు ఆకర్షితమవుతాయి. ఈ కోణంలో చూస్తే, అమరావతి చుట్టూ విద్యా, వైద్య సంస్థల అభివృద్ధి కేవలం రాజధాని అవసరమే కాదు. దక్షిణ కోస్తా మానవ వనరుల నాణ్యతను పెంచే దీర్ఘకాలిక పెట్టుబడిగా కూడా చూడాలి.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పోటీ క్రమంగా భూమి, భవనాలు, పరిశ్రమల నుంచి జ్ఞానం, పరిశోధన, సాంకేతికత వైపు మారుతోంది. ఈ నేపథ్యంలో అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగా కాకుండా నాలెడ్జ్ ఎకానమీకి వేదికగా తీర్చిదిద్దాలనే ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సెమీకండక్టర్ పరిశోధన, డీప్-టెక్ స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు వంటి రంగాల్లో దీర్ఘకాలిక సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు విజయవంతమైతే, అమరావతి దక్షిణ కోస్తా ఆర్థిక నిర్మాణానికి మరో కొత్త కోణాన్ని జోడించే అవకాశం ఉంది. అయితే ఈ ప్రయత్నాల విజయాన్ని ప్రకటనలతో కాదు; సంస్థల స్థాపన, పరిశోధన, పెట్టుబడులు, ఉపాధి సృష్టి వంటి స్పష్టమైన ఫలితాలతోనే కొలవాల్సి ఉంటుంది.ఒక్కటే. దాని అభివృద్ధి ప్రభావం గుంటూరు--కృష్ణా ప్రాంతానికే పరిమితమవుతుందా? లేక తూర్పు గోదావరి నుంచి నెల్లూరు వరకు మొత్తం దక్షిణ కోస్తాలో పెట్టుబడులు, సేవారంగం, విద్య, వైద్య రంగాల విస్తరణకు దోహదపడుతుందా? ఒక రాజధాని నిజమైన విజయాన్ని దాని పరిపాలనా సరిహద్దులు నిర్ణయించవు. దాని ప్రభావం ఎంత విస్తృత ప్రాంతానికి చేరిందన్నదే నిర్ణయిస్తుంది. అమరావతి కూడా అదే ప్రమాణంపై నిలబడాల్సి ఉంటుంది. “అయితే దక్షిణ కోస్తా అభివృద్ధి పటాన్ని మొత్తం ఒకసారి పరిశీలిస్తే, ఒక ఆసక్తికరమైన వ్యత్యాసం కనిపిస్తుంది. గోదావరి డెల్టా నుంచి కృష్ణా, గుంటూరు, నెల్లూరు వరకు అభివృద్ధి ప్రవాహం ఒక దిశలో సాగుతుండగా, మధ్యలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మాత్రం మరో ప్రశ్నను మన ముందుంచుతోంది. సహజ వనరులు ఉన్నా, విస్తారమైన భాగం ఉన్నా, ఎందుకు అదే స్థాయి అభివృద్ధి అక్కడ కనిపించలేదు? ఇదే ఇప్పుడు పరిశీలించాల్సిన తదుపరి అధ్యాయం.

## 205 మండలాల్లో దారుణ పరిస్థితులు..

**ఏలూరు, ఆగస్టు :** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు అవుతున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు. కొన్ని జిల్లాల్లో తేలికపాటి వానలు మినహా పెద్దగా వర్షాలు ఎక్కడా పడలేదు. దీంతో రాష్ట్రంలోని 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.. ఇటు రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం కూడా దారుణంగా తగ్గిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు కష్టాలు మొదలయ్యాయి.. ఖరీఫ్ మొదలై రెండు నెలలు గడిచినా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. జూన్ 1 నుంచి ఆగస్టు 3 వరకు చూస్తే రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 50.80శాతం తక్కువ వానలు పడ్డాయి. అలాగే రాష్ట్రంలో పంటలు కూడా సాధారణ విస్తీర్ణంలో 43% మాత్రమే సాగయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.8 డిగ్రీలు నమోదైందంటే పరిస్థితి ఎలా అర్థం చేసుకోవచ్చు. వచ్చే మూడు నెలల్లోనూ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.గత మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు మాత్రమే పడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో 6 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనా సరే పరిస్థితి ఏమాత్రం మారలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 73.50శాతం లోటు వర్షపాతం నమోదైంది. విశాఖపట్నం జిల్లాలో సాధారణం కంటే 66.80శాతం, చిత్తూరు జిల్లాలో 63.50శాతం, ప్రకాశం జిల్లాలో 59.70శాతం, కడప జిల్లాలో 59.20శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 57.60శాతం, శ్రీకాకుళం జిల్లాలో 57.20శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 53.60శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 50.90శాతం, మార్కాపురం జిల్లాలో 50.20శాతం తక్కువ వర్షాలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 397 మండలాల్లో లోటు వర్షపాతం.. 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి.ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 77 లక్షల ఎకరాలు ఉంటే.. ఇప్పటి వరకు 33.29 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి నాట్లు 38 ఎకరాల్లో వేయాల్సి ఉంటే.. కేవలం 15 లక్షల ఎకరాలకు పరిమితం అయ్యింది. కంది 7.50 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. 3.60 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. వేరుశనగ 9.67 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. అది కేవలం 2.27 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంతేకాదు చిత్తూరు జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో 88శాతం.. అనంతపురం జిల్లాలో 87శాతం, నంద్యాల జిల్లాలో 56శాతం సాగు విస్తీర్ణం తగ్గింది

## 1053 కిలోమీటర్ల గ్రేట్ వాల్ ఆఫ్ ఆంధ్ర

**నెల్లూరు, ఆగస్టు 5** వాతావరణ మార్పుల నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాలకు ఈ ఏడాది విపత్తుల ముంపు పొంచి ఉందని.. దానిని ఎదుర్కొనేందుకే గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కేంద్రం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందని డీసీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో విస్తరించిన 1053 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేయాలని.. అదే గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అని పవన్ కళ్యాణ్ వివరించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ పరిరక్షణ కోసం తీవ్ర స్థాయిలో కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో అడవుల విస్తరణకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఎప్పటికప్పుడు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. సీడ్ బాల్స్‌తో అడవులను పెంచాలని నిర్ణయించిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుతో మరోసారి ముందుకొచ్చారు. తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతుల నివారణ చర్యల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.రానున్న రెండు నెలల్లో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనలో భాగంగా గడిచిన రెండేళ్ల కాలంలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు.గ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాటనున్నారు అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. వీబీ జీ రాంజీ పథకంలో భాగంగా తీర ప్రాంత జిల్లాలకు అదనంగా మరో 70 లక్షల మొక్కలు కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.వాతావరణ మార్పుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు తలెత్తాయి. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న తీర ప్రాంత జిల్లాలకు విపత్తుల ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల నుంచి మన తీరాన్ని రక్షించుకోవడానికి గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషించనుంది.రాష్ట్రంలో విస్తరించిన 1053 కిలోమీటర్ల తీర ప్రాంతం వెట 5 కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేస్తున్నాం.

# ఘనంగా నవోదయ ఫౌండేషన్ డే వేడుకలు

**– ప్రిన్సిపల్ ఈ పద్మావతి**

పెన్ సత్తా మండల పరిధిలో ని బనవాసి పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో నవోదయ ఫౌండేషన్ డే--2026 వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని, ఎమ్మిగనూరు తహసీల్దార్ కె. శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ ఈ. పద్మావతి మాట్లాడుతూ నవోదయ విద్యాలయాలు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి వేదికలుగా నిలుస్తున్నాయని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నవోదయ విద్యార్థులు దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ విద్యాలయానికి మంచి పేరు తీసుకొస్తున్నారని అన్నారు. ముఖ్య అతిథి తేజస్విని మాట్లాడుతూ నవోదయ విద్యార్థులతో మమేకం






కావడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో కనిపించే క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సేవాభావం ఆదర్శప్రాయమని కొనియాడారు. విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఎమ్మిగనూరు తహసీల్దార్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ నవోదయ విద్యాలయాన్ని సందర్శించడం ద్వారా తన బాల్య జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని తెలిపారు. విద్యాలయంలో నెలకొన్న ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం ఆకట్టుకుందని పేర్కొన్నారు విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తెలుగు అధ్యాపకులు కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యాలయంలో విద్యా ప్రమాణాలు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా జేఈఈ, ఇతర పోటీ పరీక్షలకు అందిస్తున్న శిక్షణ ద్వారా పలువురు విద్యార్థులు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూములకు పోలవరం పరిహారం 40 లక్షలు

**ఇప్పిస్తామంటూ గిరిజనులకు కుచ్చు టోపీ**

**2020 లోనే పోడు పట్టాలు ఇప్పిస్తానంటూ పెద్ద ఎత్తున వసూళ్లు**

**అసలు ప్రభుత్వం మంజూరు చేసింది కేవలం టేకూరుకు 15 పట్టాలు మాత్రమే**






**వేలేరుపాడు : 05 ఆగస్ట్ వేలేరుపాడు** పెన్ సత్తా

ఏలూరు జిల్లా వెలేరుపాడు మండలం కట్కూరు పంచాయతీ పరిధిలోని టేకూరు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సుమారు రెండు వందల ఎకరాల పోడు భూముల్లో అదే గ్రామానికి చెందిన 120 మంది గిరిజన కుటుంబాలు తమ తాతల తండ్రుల కాలం నుండి సాగు చేసుకుని కుటుంబ జీవనం సాగిస్తున్న పోడు భూములకు పోడు హక్కు పత్రాలు ఇప్పిస్తానని, హక్కు పత్రాలు ఇప్పిచ్చిన తర్వాత అదే భూములకు ఎకరానికి రూ. 40 లక్షల రూపాయల చొప్పున పోలవరం భూపరిహారం వచ్చేలా చేస్తానని మాయ మాటలతో నమ్మబలికి, అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, 22 మంది గిరిజన రైతుల నుంచి పేరుకొక్కంటికి రూ. 2 లక్షల రూపాయల చొప్పున అక్రమంగా వసూలు చేశాడని, 2020 వ సంవత్సరం లో టేకూరు గ్రామంలో 15 మంది గిరిజన రైతులకు ప్రభుత్వం పోడుహక్కు పత్రాలు మంజూరు చేయగా, అదే గ్రామానికి చెందిన 120 మంది గిరిజన రైతులకు హక్కు పత్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, అవి తన వద్దే ఉన్నాయని చెబుతూ, రెండు లక్షల రూపాయలు ఇచ్చిన వారికి మాత్రమే హక్కు పత్రాలను ఇస్తానని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు బాధిత గిరిజనులు వేలేరుపాడు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆ ఆందోళనకు దిగారు. అనంతరం వేలేరుపాడు డిప్యూటీ తహశీల్దార్ సురేంద్ర కు వినతిపత్రం అందజేశారు.

# బోరుగడ్డ అనిల్ మెరుపు దీక్ష

తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నివాసం ముందు వైసీపీ సానుభూతిపరుడు బోరుగడ్డ అనిల్ కుమార్ సంచలన ఆందోళనకు దిగారు. తనను పార్టీ కార్యాలయం లోపలకు అనుమతించడం లేదని నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలతో అందరికీ షాక్ ఇచ్చారు. తాను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అభిమాని అని, ఆయన కోసం పనిచేసిన తనకు పార్టీలో కనీస గౌరవం లేకుండా చేస్తున్నారని బోరుగడ్డ ఫైర్ అయ్యారు. జగన్ కోసం పనిచేసిన తనపై 22 కేసులు నమోదు చేశారని, తన కంపెనీలు మూసివేతకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన భార్యతో కలిసి జగన్ నివాసం వద్ద బోరుగడ్డ బైఠాయించడంతో కలకలం చెలరేగింది. వైసీపీ అధినేత జగన్ రెడ్డి నివాసం, పార్టీ కేంద్ర కార్యాలయం ముందు అనూహ్యంగా బోరుగడ్డ అనిల్ కుమార్ భార్యతో కలిసి బైఠాయించడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైసీపీ అభిమానిగా ఎన్నో త్యాగాలు చేసిన తాను అధినేతను కలుస్తానంటే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సజ్జల కోటరీతో తనను రౌడీషీటర్ అంటూ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై రౌడీషీట్ లేదని హైకోర్టు చెప్పినా, వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకట్ రెడ్డి మాత్రం బోరుగడ్డ రౌడీషీటర్ అంటూ మాట్లాడుతున్నారని, ఆయనకు నోటీసులు పంపానని వెల్లడించారు. ఈ సమయంలో గతంలో తాను కారుమూరు వెంకటరెడ్డితో మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను

మీడియాకు వినిపించారు తాను పార్టీ కోసం కష్టపడ్డానని, 9 నెలలు జైలులో ఉన్నానని అయినా తనను పార్టీ ఆఫీసులోకి రానీయడం లేదన్నారు. దళితులు మా మేనమామలు అని చెప్పే జగన్ రెడ్డి ఈ విషయంలో కల్పించుకోవాలని డిమాండ్ చేశారు. తనపై సజ్జల రామకృష్ణారెడ్డి కుట్ర పన్నుతున్నారని, ఈ విషయాలు ఏవీ ఆయనకు తెలియవని ఆరోపించారు. తమకు జగన్ రెడ్డి మాత్రమే నాయకుడు అని, సజ్జల నాయకుడు కాదని వ్యాఖ్యానించారు. ఇస్త్రీ బట్టలు వేసుకుని పార్టీ కార్యాలయంలో కూర్చునే సజ్జలకు ఇక్కడ పనేమీ లేదన్నారు. తమలాంటి వారు పార్టీ కోసం కష్టపడుతున్నామని, కేసులు పెట్టించుకుని రోడ్డు మీదపడ్డామని వాపోయారు. జగన్ సతీమణి భారతి, తల్లి విజయమ్మను అవమానించారనే తాను బయటకు వచ్చానని, అయినా అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఆఫీసుకు రమ్మని నాలుగు గంటలు కూర్చోబెట్టారని అయినా జగన్ రెడ్డిని కలవనీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, వైసీపీ అభిమానిగా చెప్పుకుంటున్న బోరుగడ్డ ఆకస్మికంగా నిరసనకు దిగడంతో తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్ నివాసం వద్ద కలకలం చెలరేగింది. అంతేకాకుండా పార్టీలో జగన్ తర్వాత ఎక్కువ ప్రాధాన్యం ఉండే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జలపై అత్యంత

తీవ్ర వ్యాఖ్యలతో బోరుగడ్డ విమర్శలు గుప్పించడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ఎన్నడూలేని విధంగా బోరుగడ్డ ఇలా ఆందోళనకు దిగడం వెనుక కారణాలు ఏంటి అనే చర్చ

ఎక్కువగా జరుగుతోంది. వైసీపీ అధికారంలో ఉండగా, ఆ పార్టీ సానుభూతిపరుడిగా చెప్పుకుంటూ సోషల్ మీడియాలో బోరుగడ్డ చేసిన వ్యాఖ్యలు, ప్రత్యర్థులపై దారుణ దూషణలతో వైసీపీకి తీవ్ర నష్టం జరిగిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బోరుగడ్డపై రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదు కావడం, 9 నెలలు జైలులో ఉండటం తెలిసిందే. ఆ తర్వాత సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ వస్తున్న బోరుగడ్డ ఇప్పుడు యూటర్న్ తీసుకున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు. వైసీపీలో తనకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆయన ఆందోళన చేయడం వెనుక పార్టీపై అసంతృప్తా లేక పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి వైఖరికి నిరసన అనేది తెలియాల్సివుందని అంటున్నారు

# అదే అరాచకం.. అంతులేని పైశాచికం

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ పర్యటనలో ఆ పార్టీ కార్యకర్తలు సామాన్యులపై దాష్టీకం ప్రదర్శించారు. జగన్ దేవరపల్లి పొగాకు బోర్డులో రైతులను కలిసేందుకు బుధవారం వచ్చినప్పుడు ఆ పార్టీ కార్యకర్తలు సమీపంలోని ఓ అల్పాహార దుకాణం పైకెక్కి నృత్యాలు చేశారు. నిర్వాహకులైన మహిళలు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే సామగ్రిని ధ్వంసం చేశారు. అక్కడున్న దేవతల చిత్రపటాలనూ నేలపై పడేశారు. బాధితులు వైకాపా జెండాకర్ర తీసుకుని తిరగబడడంతో వారంతా కిందకి దూకి పరుగులు తీశారు. హోటల్లో వస్తువులు, సరకులు అన్నీ పాడైపోయాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే.. సాయంత్రానికి మాత్రం వారు మాటమార్చి ఓ వీడియో విడుదల చేశారు. ‘జగన్ అంటే మాకు ఇష్టం.. ఆయన వల్ల లబ్ధి పొందాం. ఇదంతా ఎవరో తాగుబోతులు చేసిన పని. మాకు నష్టపరిహారం ఏమీ అవసరం లేదు. మేము ఏ మీడియాకూ చెప్పలేదు.. మమ్మల్ని ఎవరూ కొట్టలేదు.. కావాలంటే ఎవరి దగ్గరికైనా వచ్చి చెబుతాం’ అని అందులో పేర్కొన్నారు.

**వేలం విధానం పరిశీలించకపోతే ఎలా?**

దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో రైతులను కలిసేందుకు జగన్ వెళ్లినపుడు ఆ పార్టీ కార్యకర్తలు అక్కడా విధ్వంసం సృష్టించారు. జగన్ తమ కష్టాలు వింటారని రైతులు భావిస్తే.. ఆయనతోపాటు వచ్చినవారు పొగాకు బేళ్లను కాళ్లతో తొక్కేసి చిందరవందర చేయడంతో రైతులు తల్లడిల్లారు. బేళ్లను మళ్లీ కట్టుకోవాలని కృష్ణంపాలేనికి చెందిన రైతు బి.ప్రసాద్ పేర్కొన్నారు. పొగాకు రైతులకు బాసటగా నిలిచేందుకని వేలం కేంద్రానికి వచ్చిన జగన్.. కనీసం ఆ ప్రకియను పరిశీలించకుండానే వెళ్లడం పట్ల కొందరు రైతులు విస్తుపోయారు. తమ సమస్యలు తెలుసుకోకుండా బేళ్లను నాశనం చేయడం ఏమిటని కరుటూరి శ్రీనివాసరావు అనే రైతు ప్రశ్నించారు.

**హెలిప్యాడ్ వద్ద..**

జగన్ పర్యటనలో ఆ పార్టీశ్రేణులు ఎక్కడా నిబంధనలు, ఆంక్షలు పట్టించుకోలేదు. హెలిప్యాడ్ వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లను ధ్వంసం చేసేశారు. పోలీసులను తోసుకుంటూ వందల సంఖ్యలో హెలికాప్టర్ వద్దకు దూసుకుపోయారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో కార్యకర్తలు దేవరపల్లి ప్రధాన రహదారులను ఆక్రమించారు. ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తీసేసి అతివేగంగా, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తూ, స్టంట్లతో వీరంగం సృష్టించారు. అంబులెన్స్‌లకు సైతం మార్గం ఇవ్వలేదు. బస్సుల రాకపోకలకూ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులంతా ఎండలో అవస్థలు పడ్డారు. రాజమహేంద్రవరం నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం వెళ్లే బస్సులు సుమారు 3గంటలు నిలిచిపోయాయి. దేవరపల్లి బస్టాండ్‌లో ప్రయాణికులను సైతం ఖాళీ చేయించి ఆ పార్టీ నాయకులు ఆక్రమించారు. వేలం కేంద్రం లోపలికి వెళ్లేందుకు 200మంది రైతులనే అనుమతించాలంటూ పేర్ల జాబితాను వైకాపా నాయకులు తొలుత పోలీసులకు అందించారు. దాని ఆధారంగానే వారిని పంపించారు. తర్వాత పెద్దసంఖ్యలో కార్యకర్తలు జగన్ వాహనశ్రేణి లోపలికి వెళ్లినపుడు, తర్వాత ఒక్కసారిగా గేట్లు తోసుకుంటూ లోపలికి చొరబడ్డారు. వేలం కేంద్రం పైకప్పు ఎక్కి వేలాడుతూ, కిటికీల వద్ద, గ్రిల్‌ను నెడుతూ ఇంకొందరు బీభత్సం సృష్టించారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు ని వివాహ శుభకార్యానికి ఆహ్వానించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు పూల నాగరాజు

పెన్ సత్తా







గుంతకల్ నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా మరియు అనం తపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు వారి కుటుంబ సమేతంగా ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారాచంద్రబాబు నాయుడుని విజయవాడ నందు మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 30న జరగబోయే గుమ్మనూరు జయరాం. కుమార్తె మరియు పూల నాగరాజు కుమారుడు వివాహ శుభకార్యానికి కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేయాలని నారా చంద్రబాబు నాయుడు ని ఆహ్వానించడం జరిగింది... ఈ కార్యక్రమంలో లిఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత గుత్తి మరియు పామిడి ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ లి మరియు పూల నాగరాజు కుటుంబ సభ్యులు మరియు గుమ్మనూరు జయరాం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు...

## మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ శివకుమారి పరామర్శించిన గౌతు స్వామి..



**శంఖవరం: ఆగస్టు 5,** పెన్ సత్తా మాజీ ఎమ్మెల్సీ, వైసీపీ రాష్ట్ర అంగన్వాడీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంగూరి లక్ష్మీ శివకుమారి భర్త బాలకృష్ణ ఇటీవల కన్నుమూయడంతో వారి కుటుంబ సభ్యులను వైసీపీ జిల్లా ఆర్.టీ.ఐ అధ్యక్షులు గౌతు స్వామి పరామర్శించారు. బాలకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీ శివకుమారి మరియు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు కాకి నాని తో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## యువతపై జరిగిన హింసకు అమిత్ షానే బాధ్యుడు

కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. నిరసన చేస్తున్న యువతపై జరిగిన హింసకు అమిత్ షానే బాధ్యుడని దుయ్యబట్టారు. విద్యార్థులకు సంబంధించి ఏం జరిగిందో పార్లమెంటులో వివరించే ధైర్యం ఆయనకు లేదని విమర్శించారు. పేపర్ లీకేజీల సమస్యపై నిరసన తెలిపిన విద్యార్థులను కలిసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. రాజ్యాంగం కోసం పోరాడి, భారతదేశ భావనను పరిరక్షించిన వేలాది మంది విద్యార్థులను చూసి గర్వంగా ఉందన్నారు. తమ భవిష్యత్తు కోసం, న్యాయమైన పరీక్షా విధానం కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలపడంలో ఎలాంటి తప్పులేదని, విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడం నేరం కాదన్న రాహుల్, దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీవ్రంగా స్పందించారు.

“యువ నిరసనకారులతో మేము స్వేచ్ఛగా మాట్లాడాం. తమపై దాడి చేశారని, కొట్టారని, బెదిరించారని వారు నాతో చెప్పారు. నాకు వారిని చూసి చాలా గర్వంగా ఉంది. వారు చేసిన పనికి, అలాగే వారిలాగే వేలాది మంది యువ భారతీయులు చేసిన పనికి నేను చాలా గర్విస్తున్నాను. వారు రాజ్యాంగాన్ని కాపాడారు, ‘భారతదేశం’ అనే భావనను రక్షించారు, భారతదేశ భవిష్యత్తును కాపాడారు. లోపభూయిష్టంగా, కుప్పకూలే స్థితిలో, నిరుపయోగంగా ఉన్న విద్యావ్యవస్థపై ఫిర్యాదు చేయడం ఏమాత్రం నేరం కాదు. ఒకవేళ ఏమైనా చేయాల్సి ఉంటే, ఆ వ్యవస్థను మార్చాలి, సరిదిద్దాలి. వారు కోరింది కూడా సరిగ్గా అదే. వారు ఎలాంటి హింసకూ పాల్పడలేదు, దూకుడుగా ప్రవర్తించలేదు, అసభ్యంగా నడుచుకోలేదు. కానీ వారిపై దాడి చేశారు, కొట్టారు, బెదిరించారు. మహిళల ఇళ్లకు గుండాలను పంపడం, 15 ఏళ్ల చిన్నారిని బలవంతం చేసి క్షమాపణలు చెప్పించడం, ఆపై ఆ క్షమాపణను అంగీకరించడం పక్కా మూర్ఖత్వం. దాన్ని మేము అంగీకరించం. సరిగ్గా పనిచేసే విద్యావ్యవస్థ మాకు కావాలి. ప్రశ్నాపత్రాల లీకేజీలు ఆగాలి. ఈ దేశ భవిష్యత్తు అయిన ఈ యువతను గౌరవించాలి, రక్షించాలి. మీ అందరినీ చూసి నేను ఎంతగానో గర్విస్తున్నాను. ఈ పని చేసిన ప్రతి ఒక్క యువకుడిని చూసి గర్విస్తున్నాను. మీరు ఎలాంటి తప్పూ చేయలేదు. ఇక మీరు క్షమాపణ చెప్పాలనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. మీరు ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు, ఎందుకంటే మీరు ఏ తప్పూ చేయలేదు.”“యువతిపై పెల్లెట్ గన్‌తో కాల్పులు జరిపిన వ్యక్తి. కొన్ని రోజుల క్రితం నేను మీడియా ముందు ఉంచిన యువకుడిపై పెల్లెట్ గన్‌తో కాల్పులు జరిపిన వ్యక్తి. అలాగే ఈ యువతికి వ్యతిరేకంగా పోలీసు యంత్రాంగాన్ని ఉసిగొల్పిన వ్యక్తి అమిత్ షానే. ఆయనే భారతదేశ హోం మంత్రి. ఆయన (షా) పార్లమెంటుకు రావాల్సిన కనీస మర్యాద కూడా పాటించడం లేదు. జరిగిన ఘటనపై స్పందించే కనీస మర్యాద, ధైర్యం ఆయనకు లేవు. ఇందులో రెండు అవకాశాలు ఉన్నాయి: ఒకటి, పిల్లలపై హింస జరిగిందన్న విషయం ఆయనకు తెలియకపోవచ్చు. అలా అయితే ఆయన అసమర్థుడు అనుకోవాలి. రెండోది యువతపై పెల్లెట్ గన్ కాల్పులు జరపాలని, హింసను ప్రేరేపించాలని ఆయనే ఆదేశించి ఉండవచ్చు. అలా అయితే ఆయన బాధ్యుడు (నేరస్థుడు) అవుతారు. ఏది ఏమైనప్పటికీ, దీనికి ఆయనే బాధ్యుడు.” అని రాహుల్ గాంధీ అన్నారు. సమర్థంగా పనిచేసే విద్యా వ్యవస్థ ఉండాలని, పరీక్షా పత్రాల లీకేజీలు ఆగిపోవాలని, అలాగే భవిష్యత్తును గౌరవించి కాపాడాలని గాంధీ పిలుపునిచ్చారు.

## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లేవ్

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారంటూ వస్తున్న వార్తలకు కేంద్ర ప్రభుత్వం తెరదించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై (నియోజకవర్గాల పునర్విభజన) చర్చించేందుకు ఆగస్ట్ 16- 18 తేదీల్లో స్పెషల్ సెషన్ నిర్వహించానున్నారనే ప్రచారాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. అలాంటి ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని ఆయన బుధవారం రాత్రి స్పష్టం చేశారు. అదే విధంగా ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలను పొడిగించే అవకాశాలు కూడా లేవని రిజిజు వెల్లడించారు.

# కోలంకలో ఘనంగా ఉచిత పశువైద్య శిబిరంఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో నిర్వహణ

**కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం** పెన్ సత్తా

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గం, పిఠాపురం మండలం కోలంక గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం ఘనంగా జరిగింది. పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశుసంపదను పరిరక్షించడం, పశుపోషక రైతుల ఆదాయాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో నిపుణులైన వైద్య బృందం పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే పశుసంవర్ధక రంగంలో లాభాలు, పశువుల సంరక్షణపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో రైతులు, పశుపోషకుల సంక్షేమం కోసం ప్రభుత్వం గ్రామస్థాయిలోనే ఇటువంటి శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రైతులకు అవసరమైన సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్





వాకపల్లి దేవి సూర్యప్రకాష్, ఏలేరు ప్రాజెక్టు వైస్ చైర్మన్ ఊట ఆది విష్ణు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, జనసేన పార్టీ పిఠాపురం మండలం ఇన్‌చార్జ్ వెన్నా జగదీష్, అన్నవరం పాలక మండలి సభ్యుడు గంజి గోవిందరాజు పాల్గొన్నారు.అలాగే మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు కేతిరెడ్డి గౌరీ నాగలక్ష్మి, రామిశెట్టి సూరిబాబు, కారపురెడ్డి వెంకటేష్, కొండపల్లి శివ, ఆది, మార్కెట్ యార్డ్ సెక్రటరీ ప్రమీల, సూపర్వైజర్ దేవి పాల్గొన్నారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డి.ఎస్. రమేష్ చందర్, మండల అసిస్టెంట్ వెటర్నరీ డాక్టర్ రంజిత్ సింగ్, కోలంక వెటర్నరీ డాక్టర్ హరీష్, కుమారపురం వెటర్నరీ డాక్టర్ లావణ్య, వెల్దుర్తి వెటర్నరీ డాక్టర్ రవీంద్రలతో పాటు కూటమి ప్రభుత్వ నాయకులు, జనసేన కార్యకర్తలు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

## ఉప్పరాహాల్ గ్రామంలో డోర్ టూ డోర్ టీడీపీ కార్యక్రమం



**కౌతాళం ఆగస్టు 05** పెన్ సత్తా కుటామి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అయిన సందర్భంగా డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరియు యువ నాయకులు నారా లోకేష్ మరియు టిడిపి మంత్రాలయం ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి మరియు జిల్లా ఉపాధ్యక్షులు చూడి ఉలిగయ్య మరియు కౌతాళం మండలం అధ్యక్షుడు సురేష్ నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపట్టిన డోర్ టు డోర్ కార్యక్రమాన్ని బుధువారం రోజున ఉప్పరహాల్ గ్రామంలో 175 బూత్ లో డోర్ 2 డోర్ కార్యక్రమనికి 100 శాతం పూర్తి చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు ఈరన్న,తెలుగు తమ్ముళ్లు కరియప్ప బీరుమల్ల,యువ నాయకులు రంగస్వామి, సురేష్, వీరేష్,అయ్యప్ప, అనంత్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## కౌతాళంలో ఎబివిపి ఆధ్వర్యంలో విజయవంతంగా కళాశాలలో బంద్



**కౌతాళం, ఆగష్టు 05** పెన్ సత్తా ఆంధ్రప్రదేశ్లో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పడినటువంటి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి పరిషత్ కళాశాలల బందుకు పిలుపునివ్వడం జరిగింది.ఈ సందర్భంగా కౌతాళం మండలంలో ఉన్నటువంటి ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలను విజయవంతంగా బంద్ చేయడం జరిగిందని మంత్రాలయం బాగ్ కన్వీనర్ వై శివాజీ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు సరైన సౌకర్యాలు,విద్యా విధానం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం వెనకబడిందని తెలిపారు. కావున తక్షణమే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిలభారత విద్యా పరిషత్ బంద్ కు పిలుపునివ్వడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఈ ధర్నాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కౌతాళం కన్వీనర్ బి.ఎంకన్న మరియు కళాశాల విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## చంద్రబాబు పాలన రైతులకు హానికరం

పారిశ్రామిక రంగాలు.. అన్నింటిలోనూ విధ్వంసమే కనిపిస్తోంది. ఇంకా చంద్రబాబునాయుడు పరిపాలనలో పొద్దుట లేచినప్పటి నుంచి మనకు కనిపించేది ఏమిటి అంటే.. ఎవరైనా అన్యాయం అయిపోయిన పరిస్థితులలో ప్రశ్నిస్తే, అక్రమ కేసులు. అక్రమ అరెస్టులు. ఇవి మాత్రమే చంద్రబాబునాయుడు పరిపాలనలో మనకు కనిపిస్తాయి. చంద్రబాబు పార్టీ అంటే వెన్నుపోటు పార్టీ. ఈ వెన్నుపోటు పార్టీ వల్ల రాష్ట్రానికి, ప్రజలకు బాధ తప్ప ఇంకేమైనా ఉందా అని అడుగుతున్నారు. రాష్ట్రంలో ఇవాళ వ్యవసాయ రంగాన్ని తీసుకోండి. 67 శాతం జనాభా వ్యవసాయం మీద ఆధారపడి ఉన్న నేపథ్యంలో 26 నెలలు కనీసం ఏ పంటకైనా కూడా గిట్టుబాటు ధరలు వచ్చాయా అని అడుగుతున్నాను. 26 నెలలుగా వరి, మొక్కజొన్న, అరటి, కొబ్బరి, పత్తి, పెసర్లు, సజ్జలు, మిర్చి, పొగాకు, టమోటా, చీనీ పంటకు కానీ.. చివరకు మామిడి రైతులకు కూడా గిట్టుబాట్యు ధర రాని పరిస్థితి. ఇవాళ ఇక్కడికి వచ్చి నేను పొగాకు రైతుల ఆక్రందనల మధ్య నిలబడి ఉన్నా. ఈ పొగాకు రైతులు సంబంధించిన పంటను తీసుకున్నా, ఇవాళ కనిపిస్తున్నది ఏమిటి అని అంటే సంక్షోభమే. రైతులు ఇవాళ రోడ్డు ఎక్కుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆత్మహత్య చేసుకున్నా కనీస పరామర్శ లేదు. నా కళ్ల ఎదుటే జంగారెడ్డిగూడెం సమీపంలోని బుట్టాయిగూడెం మండలానికి చెందిన వెంకటేశ్వరరావుగారి కుటుంబం నిలబడి ఉంది. పది ఎకరాల్లో సాగు చేసి, గిట్టుబాటు ధర రాక, పంటను అమ్ముకోలేక ఆ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య ఈ రోజు నా ఎదుట నిలబడి ఉంది. ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి ఒక్క ఎంపీ కానీ, ఒక్క ఎమ్మెల్యే కానీ, ఒక్క మంత్రి కానీ వెళ్లలేదు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కనీసం పరామర్శ కూడా చేయని ప్రభుత్వం ఇది. నాడు పొగాకుకు అత్యధికంగా రూ.411. ఇప్పుడు కేవలం రూ.214 మాత్రమే. ఒక్కసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పరిస్థితిని గుర్తు చేసుకుందాం. 2023--24లో రాష్ట్రవ్యాప్తంగా ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలు కలిపి పొగాకు సగటు ధర కిలోకు రూ.289 లభించింది. అత్యధిక ధర కిలోకు రూ.411 వరకు నమోదైంది. ఇవి నేను చెబుతున్న లెక్కలు కావు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) 2025, జనవరి 1న అధికారికంగా విడుదల చేసిన గణాంకాలు ఇవి. ఇప్పుడు పరిస్థితి ఏమిటని చూస్తే.. ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలు కలిపి రాష్ట్రంలో పొగాకు కిలో సగటు ధర కేవలం రూ.214 మాత్రమే. అంటే ఒకప్పుడు రూ.289 వచ్చిన చోట ఇప్పుడు రూ.214 మాత్రమే వస్తోంది. అంటే ప్రతి కిలోపై రైతు సుమారు రూ.75 నష్టపోతున్నాడు. ఇదే ఉత్తరాది ప్రాంతంలో, ఇదే దేవరపల్లి ప్రాంతంలో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 2023--24లో పొగాకు కిలో సగటు ధర రూ.326 ఉండేది. ఇప్పుడు అదే ప్రాంతంలో ఆ సగటు ధర కేవలం రూ.236కి పడిపోయింది. రైతులు నమ్మి పంట వేస్తే, ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?. టొబాకో బోర్డు లిఖితపూర్వకంగా 142 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీని నమ్మి రైతులు పంట వేశారు. కానీ చివరకు కొనుగోలు చేసింది కేవలం 47.3 మిలియన్ కిలోలు మాత్రమే. అంటే హామీ ఇచ్చిన పరిమాణంలో కేవలం 33 శాతం మాత్రమే కొనుగోలు చేశారు. 105 రోజుల వేలం ప్రక్రియ ముగిసిపోయినా రైతుల వద్ద ఇంకా పెద్ద మొత్తంలో పొగాకు నిల్వలు ఉన్నాయి. ఇది రైతులకు ఎంతటి దుర్భర పరిస్థితిని తీసుకొచ్చిందో అర్థం చేసుకోవచ్చు అని అన్నారు.

## విశాఖ సమగ్రాభివృద్ధికి మైక్రో ప్లానింగ్

అవకాశం ఉందని అధికారులు వివరించారు. ప్రైవేట్ రంగం నుంచి రూ. 5.30 లక్షల కోట్ల పెట్టుబడులు, అలాగే రూ. 3.50-4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయాల్సి వస్తుందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెల్లార్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ వంటివి విశాఖ, ఉత్తరాంధ్ర కేంద్రంగా వచ్చిన అంశాన్ని అధికారులు ఈ సందర్భంగా ప్రస్తావించారు.

# రాష్ట్రం నష్టాల నుంచి అభివృద్ధి వైపుకు

**లింగాలదిన్నే గ్రామంలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో ...యువ నాయకులు సతీష్ నాయుడు మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు క్లస్టర్ చంద్రన్న...**



**కౌతాళం,ఆగష్టు 05** పెన్ సత్తా బుధవారం రోజున మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం లింగలదిన్నే గ్రామం నందు కూటమి ప్రభుత్వం ఆదేశానుసారం ఇంచార్జీ ఎన్.రాఘవేందర్ రెడ్డి పిలుపు మేరకు మండల అధ్యక్షులు సురేష్ నాయుడు అధ్యక్షతన ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి లబ్ధిదారున్ని ఈ రెండేళ్ల సుపరిపాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ అభివృద్ధి గురించి అడిగి తెలుసుకుంటూ, రాష్ట్రం గత ప్రభుత్వం నాశనం చేసిందని, నేడు చంద్రబాబు దూరదృష్టితో రాష్ట్రం అభివృద్ధి లో ముందుకెళ్తుందని తెలియజేస్తూ గ్రామ సమస్యలను అడిగితెలుసుకున్నారు. తక్షణమే గ్రామ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని గ్రామ ప్రజానీకానికి హామీ ఇవ్వడం జరిగినది. కార్యక్రమంలో గ్రామ నాయకులు గోవిందప్ప,మారెప్ప, వెంకటేశు,నరసప్ప, మహేష్, శ్రీకాంత్ బసవ,చెన్న బసవ,నాగేష్,మారేష్, పంపా మొదలగు తెలుగు యువత పాల్గొనడం జరిగినది.

# నవజాత శిశువుకు తల్లిపాలే తొలి టీకా

**అంగన్వాడీ సూపర్‌వైజర్ రాధ**
**ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే ఇవ్వాలి**
**గుండాల కాలనీలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు**



గుండాల కాలనీలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీలో పాల్గొన్న అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు.



గుండాల అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సూపర్వైజర్ రాధ.

**ఎటపాక, ఆగస్టు 5** పెన్ సత్తా నవజాత శిశువుకు తల్లిపాలే తొలి టీకా అని, పుట్టిన నాటి నుండి మొదటి ఆరు నెలల పాటు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ రాధ స్పష్టం చేశారు. సీడీపీవో అరుణ ఆదేశాల మేరకు, పోలవరం జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామపంచాయతీ పరిధిలోని గుండాల కాలనీ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూపర్‌వైజర్ రాధ మాట్లాడుతూ... తల్లిపాలు బిడ్డలో రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా ఆస్తమా, అలెర్జీలు, మధుమేహం, రక్తపోటు, రక్త క్యాన్సర్, ఎదుగుదల లోపం వంటి తీవ్రమైన వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయని తెలిపారు. తల్లిపాలకు ప్రత్యామ్నాయంగా ఇతర పాలు ఇవ్వడం వల్ల పసికందులకు శ్వాసకోశ సమస్యలు, ఎదుగుదల లోపాలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బిడ్డ ఆరోగ్యానికే కాకుండా బాలింతల ఆరోగ్యానికి కూడా తల్లిపాలు ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ తోట శశికుమార్, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు జి. పుష్పవతి, టి. సుభద్ర, ఎన్. సరోజిని, కె. శ్రావణి, అంగన్వాడీ సహాయకురాళ్లు ఎస్. మంజుల, జి. మహేశ్వరి, ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, జయ, ఆశా వర్కర్ కె. కమలతో పాటు పెద్ద సంఖ్యలో గర్భిణులు, బాలింతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## టీడీపీ సమస్యల పరిష్కారమే లక్ష్యం బచ్చల వీర ప్రతాప్



**ప్రొద్దుటూరు,ఆగస్టు05** పెన్ సత్తా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆదేశాల మేరకు గోపవరం పంచాయతీ పరిధిలోని 219వ బూత్‌లో బుధవారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బచ్చల వీర ప్రతాప్ పాల్గొని ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో శెట్టి, అన్నన్న, ఆర్ఎంపీ శివ, పెద్దోళ్లు, రాముడు, మధు, చిన్నోళ్లు, రమణ, అక్బర్, శ్రీను, మాధవ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# యువతే కాంగ్రెస్ భవిష్యత్తు రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ ప్రధాని ఎం.ఎం.పల్లం రాజు



**శంఖవరం ఆగస్టు 5** పెన్ సత్తా యువతే కాంగ్రెస్ కు భవిష్యత్తు అని రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రిని పల్లం రాజు అన్నారు కాకినాడ జిల్లా డిసిసి ఆఫీస్ లో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ కేంద్ర మంత్రివర్యులు శ్రీ ఎం.ఎం.పల్లం రాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో జెన్ జెడ్ యువత కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. 1997 నుండి 2012 వరకు జన్మించిన యువత దేశ జనాభాలో 35 శాతం ఉన్నారని, పార్టీ విజయాన్ని నిర్ణయించేది వీరేనని స్పష్టం చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, దీనికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, కాకినాడ సిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెక్క నూకరాజు, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు, పెద్దాపురం నియోజకవర్గ ఇంచార్జ్ మలకల సూరిబాబు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు దరణాల కోట శ్రీను, జిల్లా ఎస్.సి సెల్ అధ్యక్షులు ముయ్యేటి సూర్యప్రకాశరావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రామకుర్తి సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనుముల రాజా, ప్రత్తిపాడు మండల అధ్యక్షులు దొడ్డిపట్ల సుబ్బరాజు, సమన్వయ కమిటీ సభ్యులు ఆలేటి అనిల్ కుమార్, పెదిరెడ్డి వీరబాబు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## అపోహలు వద్దు

గోదావరి పుష్కరాల్లో రాష్ట్ర, దేశ, విదేశీ భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పుష్కర పుణ్య స్నానాలు ఆచరించే విధంగా తగిన కార్యాచరణ ఉండాలని సీఎస్ ఆదేశించారు. భక్తుల రద్దీ నిర్వహణ, స్నాన ఘట్టాల వారీగా తగిన ఏర్పాట్లు అవసరమన్నారు. వివిధ పీఠాధిపతులు, మఠాధిపతులు, ప్రముఖ స్వామీజీలు, ప్రముఖ ప్రవచన కర్తలను స్వయంగా కలిసి వారి సూచనలు, సలహాలను తీసుకుని పుష్కరాల సమర్థ నిర్వహణకు తోడ్పడాలని ఆదేశించారు. వారి సూచనలను, సలహాలను పుష్కరాల కమ్యూనికేషన్ ప్లాన్‌లో పొందుపరచాలన్నారు. వాహనం దిగిన తర్వాత ఆయా స్నాన ఘట్టాల వరకు ఎంత దూరం నడవాలనే దానిపై కూడా స్పష్టంగా బోర్డులు ఉండాలన్నారు. గోదావరి నది వెంబడి ఏ స్నాన ఘట్టంలోనైనా పుష్కర స్నానం చేసినా పుణ్యం వస్తుందని ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా వారిలో విశ్వాసాన్ని కలిగించాలని చెప్పారు. కేవలం పలానా స్నాన ఘట్టంలో స్నానం ఆచరిస్తేనే పుణ్యం వస్తుందనే అపోహను ప్రజల్లో తొలగించాలని సూచించారు.

భక్తుల రద్దీ పెరిగే అవకాశం

భక్తుల రద్దీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా రైలు, రోడ్డు మార్గాల్లో లక్షల్లో తరలి వచ్చే భక్తుల క్రమబద్ధీకరణకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలని ప్రతిపాదించారు. గోదావరి పుష్కరాల ప్రత్యేక అధికారి, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీరపాండ్యన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ గత పుష్కరాలకు సుమారు 4.80 లక్షల మంది భక్తులు వచ్చారన్నారు. రానున్న పుష్కరాలకు ఆ సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. పోలవరం, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ 6 జిల్లాల్లో రూ. 3,161 కోట్ల అంచనాలో 21 శాఖల ద్వారా 4,695 వివిధ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ. 60 కోట్ల పనులు మొదలయ్యాయని చెప్పారు. ఇకపై గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి అధికారులు అందరితో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

## శ్రీరాముడు అందరివాడు.. మత సామరస్యానికి ప్రతీకగా ముస్లిం వ్యక్తి వ్యాఖ్యలు



మనుషుల మధ్య సోదరభావాన్ని, శాంతిని పెంపొందించే వార్తలు ఎప్పుడూ నెటిజన్ల మనసులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఇటీవల సోషల్ మీడియా వేదికగా మత సామరస్యానికి అద్దం పట్టే ఓ అరుదైన దృశ్యం నెట్టింట విస్తృతంగా చర్చనీయాంశమైంది. సామాజికవేత్త సయ్యద్ హుస్సేనీ శ్రీరామునిపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెటిజన్ల హృదయాలను గెలుచుకుంటున్నాయి. శ్రీరాముడు ఏ ఒక్క వర్గానికో లేదా ఒక్క మతానికో సొత్తు కాదని.. ఆయన అందరివాడని ఆయన వ్యాఖ్యానించారు.

తాను కూడా పూర్తి విశ్వాసంతో "జై శ్రీరామ్" అని చెబుతానని పేర్కొన్న సయ్యద్ హుస్సేనీ.. రాముడు మర్యాద పురుషోత్తముడిగా ఈ ప్రపంచానికే గొప్ప ఆదర్శమని అభిప్రాయపడ్డారు. రామరాజ్యం అనేది కేవలం ఒక మతానికి సంబంధించిన భావన మాత్రమే కాదని, అది సమాజంలో న్యాయం, సమానత్వం, సుపరిపాలన ధర్మానికి ప్రతీక అని ఆయన స్పష్టం చేశారు. రామరాజ్యంలో మహిళలకు పూర్తి రక్షణ, ప్రజలందరికీ సమాన న్యాయం, పాలకుల బాధ్యత వంటి మహోన్నత విలువలు ఉన్నాయని వివరించారు. సమాజంలో శాంతి, సామరస్యం పునర్నిర్మించబడాలంటే శ్రీరాముడు చూపిన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు.తన వ్యాఖ్యల్లో దైవత్వం గురించి హుస్సేనీ చెప్పిన మాటలు నెటిజన్లను ఎంతగానో ఆలోచింపజేస్తున్నాయి. దేవుళ్లందరూ ఒక్కటేనని.. ముస్లింలు ఉండకూడదని దేవుళ్లు భావించి గాలిని ఇవ్వడం ఆపేస్తే మనం బతకలేమని ఆయన గుర్తుచేశారు. సృష్టికర్తయిన దేవుడికే లేని భేదభావాలు, వివక్ష మనుషులమైన మనకెందుకు అని ఆయన ప్రశ్నించారు. మతం పేరుతో మనుషుల మధ్య గోడలు కట్టకుండా, పరస్పర గౌరవం సోదరభావంతో జీవించాలని కోరారు.సోషల్ మీడియాలో ముస్లిం ప్రముఖులు లేదా సామాజిక కార్యకర్తలు శ్రీరాముడి ప్రాశస్త్యం గురించి, రామరాజ్యంలోని లౌకిక విలువల గురించి మాట్లాడటం ఇదే తొలిసారి కాదు. గతంలో కూడా పలువురు మేధావులు రామరాజ్యాన్ని పేదరికం లేని, వివక్షకు తావులేని సమాజంగా అభివర్ణించారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ వీడియోపై నెటిజన్ల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మతం కంటే మానవత్వమే గొప్పదని, ఇలాంటి సందేశాలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తాయని మెజారిటీ నెటిజన్లు కొనియాడుతున్నారు. అదే సమయంలో దేశంలో మతాలకు అతీతంగా పరస్పర సహనం, విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉందంటూ నెట్టింట ఆరోగ్యకరమైన చర్చలు సాగుతున్నాయి.మొత్తానికి సయ్యద్ హుస్సేనీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట మత సామరస్యానికి సరికొత్త వేదికను ఏర్పాటు చేశాయి. సంకుచిత భావాలను పక్కన పెట్టి మానవత్వాన్ని చాటిచెప్పే ఇటువంటి సందేశాలు సమాజ పురోగతికి ఎంతో దోహదపడతాయని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు.

## దుబాయ్‌లో అదృశ్యమైన హైదరాబాద్ యువతి.. నాలుగు నెలలుగా ఫోన్ స్విచ్ఛాఫ్.. కుటుంబంలో ఆందోళన



ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యువత అక్కడ అదృశ్యమవుతున్న ఘటనలు ఇటీవల తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా హైదరాబాద్ పాతబస్తీకి చెందిన ఒక 24 ఏళ్ల యువతి దుబాయ్‌లో ఆచూకీ లేకుండా పోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. గత నాలుగు నుంచి ఐదు నెలలుగా ఆమె ఉపయోగిస్తున్న ఫోన్ నంబర్లు స్విచ్ఛాఫ్ వస్తుండటంతో ఏమి జరిగిందో తెలియక ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**కుటుంబ భారాన్ని భుజాన వేసుకొని విదేశాలకు..**

పాతబస్తీ ప్రాంతానికి చెందిన ఈ యువతి మెడికల్ విద్యను పూర్తి చేసింది. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న తండ్రి మరణించడంతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి ఒక్కసారిగా క్లిష్టంగా మారింది. దాంతో తన కుటుంబ బాధ్యతలను నెరవేర్చేందుకు ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ఆమె విదేశాల్లో ఉద్యోగం చేయాలని గట్టిగా నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే గత ఏడాది ఆగస్టు నెలలో దుబాయ్ వెళ్ళిన ఆమె.. అక్కడి ఒక ప్రముఖ ఆస్పత్రిలో ఉద్యోగంలో చేరినట్లు కుటుంబ సభ్యులకు తెలిపింది. దుబాయ్ వెళ్లిన ప్రారంభంలో ఆమె ప్రతిరోజూ క్రమం తప్పకుండా కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడేది. తన ఉద్యోగ వివరాలు, అక్కడ ఉంటున్న పరిస్థితులు, తన దినచర్య గురించి ఎప్పటికప్పుడు సమాచారం పంచుకునేది. అయితే గత నాలుగు నుంచి ఐదు నెలలుగా పరిస్థితి పూర్తిగా తలకిందులైంది.

**నాలుగు నెలలుగా స్విచ్ఛాఫ్.. లభించని సమాచారం**

ఆమె ఉపయోగిస్తున్న రెండు మొబైల్ ఫోన్లు నిరంతరం స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబంలో ఆందోళన మొదలైంది. వాట్సాప్ లేదా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ఎంత సంప్రదించేందుకు ప్రయత్నించినా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో తీవ్రంగా భయాందోళన చెందిన కుటుంబ సభ్యులు దుబాయ్‌లో నివసిస్తున్న తమ బంధువులు, తెలిసిన వారిని ఆశ్రయించారు. వారు స్థానికంగా ఉన్న ఆస్పత్రులు, ఆమె పనిచేస్తున్నట్లు చెప్పిన ప్రదేశాల్లో నివాస ప్రాంతాల్లో ఎంతగా వెతికినా ఎటువంటి సమాచారం లభించలేదు.

**పోలీసులను ఆశ్రయించిన కుటుంబం**

బంధువుల ద్వారా చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో తీవ్ర మానసిక వేదనకు గురైన కుటుంబ సభ్యులు మంగళవారం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. తమ కుమార్తెను ఎలాగైనా గుర్తించి, క్షేమంగా స్వదేశానికి రప్పించాలని అధికారులను కన్నీళ్లతో వేడుకున్నారు. బాధితుల ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ , భారత రాయబార కార్యాలయం, దుబాయ్ స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లి యువతి ఆచూకీ కనుగొనేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు సమాచారం.

**విదేశాలకు వెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ఇటీవలి కాలంలో గల్ఫ్ దేశాలతో పాటు ఇతర విదేశాలకు ఉద్యోగాల కోసం వెళ్లే నిరుద్యోగులు ఇలా అదృశ్యం కావడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ తరహా ఘటనల నేపథ్యంలో విదేశాలకు వెళ్లే ఉద్యోగులు తమ నివాస స్థలం అడ్రస్, రూమ్‌మేట్స్ వివరాలను ఇంట్లో ఖచ్చితంగా పంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే తాము పనిచేస్తున్న కంపెనీ ఆఫర్ లెటర్, మేనేజ్‌మెంట్ కాంటాక్ట్ నంబర్లు కుటుంబ సభ్యుల వద్ద ఉంచడం చాలా అవసరం. స్థానికంగా ఉండే భారత రాయబార కార్యాలయం నంబర్లు, సహాయక బృందాల సమాచారాన్ని భద్రపరుచుకోవడం అత్యవసర సమయాల్లో ఎంతో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం పాతబస్తీలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న ఈ ఘటనపై పోలీసులు.. విదేశాంగ శాఖ వేగంగా స్పందించి బాధితురాలిని క్షేమంగా ఇంటికి చేరుస్తారని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మా అబ్బాయి ప్రమాదం చేశాడని తెలీదు: కస్టడీలో సీదిరి



శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు ఒక రోజు కస్టడీకి తీసుకుని విచారించారు. ఈ సమయంలో ఆయనకు 20 నుంచి 30 ప్రశ్నలు సంధించారు. ముఖ్యంగా బాధిత కుటుంబాన్ని ఎందుకు మాయ చేసే ప్రయత్నం చేశారని ఆయనను ప్రశ్నించారు. అలానే బాధిత కుటుంబానికి 9 లక్షల రూపాయలు ఇవ్వజూపిన విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు. అదేవిధంగా తన కుమారుడి స్థానంలో వేరే వ్యక్తి ప్రమాదం చేసినట్టు పోలీసులకు తప్పుడు సమాచారం ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. అయితే.. వీటికి సీదిరి ఎక్కడా తడుముకోకుండా సమాధానాలు చెప్పినట్టు పోలీసులు తెలిపారు.

తన కుమారుడు ప్రమాదం చేసినట్టు తనకు అసలు తెలీదని.. తన స్నేహితుడితో కలిసి బుల్లెట్‌పై ప్రయాణించాడని అనుకున్నట్టు సీదిరి వెల్లడించారు. ఈ క్రమంలోనే ప్రమాదం జరిగి ఉంటుందని భావించానని, అందుకే.. తన కుమారుడి పేరును చెప్పలేదని ఆయన వెల్లడించారు. ఈ సమయంలో సీసీటీవీ ఫుటేజీలను చూపించగా.. అవి నకిలీవి ఎందుకు కాకూడదని ఆయన ప్రశ్నించారు. తమపై టీడీపీ నాయకులు కుట్ర చేస్తున్నారని.. ఈ కోణంలోనూ కేసును విచారించాలని ఆయన కోరారు. అదే సమయంలో బాధిత కుటుంబానికి 9 లక్షల రూపాయల ఇవ్వజూపామన్న దానిలో తమ పాత్ర లేదని.. మీడియా సృష్టించిందని సీదిరి తెలిపారు.

**నా గురించి మీకు తెలీదా?**

ఈ సమయంలో సీదిరి అప్పలరాజు పోలీసులను ఉద్దేశించి.. నా గురించి మీకు తెలియదా? అని వ్యాఖ్యానించారు. తాను దాదాపు 20 ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్నానని.. వైద్యుడిగా, రాజకీయ నేతగా కూడా ప్రజలకు సేవ చేస్తున్నానని చెప్పారు. తనను అక్రమంగా ఈ కేసులో ఇరికించారని ఆయన వ్యాఖ్యానించారు. అయితే.. ఆయన చెబుతున్న విషయాలకు.. వాస్తవంగా జరిగిన దానికి సంబంధం లేకపోవడంతో మరో రోజు కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని కోర్టుకు తెలిపి. ఆయనను కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ఏం జరిగింది?**

శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన సీదిరి కుమారుడు ఆరవ్ వర్మ.. గత నెలలో బుల్లెట్ నడిపి.. ప్రమాదాని గురయ్యారు. ఓ గొర్రెల కాపరి దానయ్యను బలంగా ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. అయితే.. దీనిని మసిపూసి మాయ చేసేందుకు.. కేసు నుంచి తన కుమారుడిని తప్పించేందుకు సీదిరి పన్నాగం పన్నారన్నది పోలీసులు చెబుతున్న మాట. ఈ క్రమంలో ఆరవ్ స్నేహితుడే ప్రమాదం చేశాడని పోలీసులకు సమాచారం ఇచ్చారు. తర్వాత.. వాస్తవాలు తెలుసుకున్న పోలీసులు.. ఆరవ్‌ను అరెస్టు చేశారు. అనంతరం.. మోసం కేసులో సీదిరిని కూడా అరెస్టు చేశారు. మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఒక రోజు కస్టడీకి కోర్టు

## ముదురుతున్న మోదీ వీడియో తొలగింపు వివాదం.. కేంద్రం కాళ్ల బేరానికి 'మెటా' ప్రతినిధులు





ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన ఒక వీడియోను ఫేస్‌బుక్ ప్లాట్‌ఫారమ్ నుంచి ఉన్నపళంగా తొలగించిన వ్యవహారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ, న్యాయపరమైన సంచలనానికి దారితీసింది. ఈ సున్నితమైన అంశంపై మెటా సంస్థ అందించిన వివరణ పట్ల కేంద్ర ప్రభుత్వం, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. మెటా సమాధానం ఏమాత్రం సంతృప్తికరంగా లేకపోవడంతో వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలోనే పరిస్థితి తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న పార్లమెంటరీ కమిటీ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ రాబోయే మూడు రోజుల్లోగా బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని స్పష్టమైన అల్టిమేటమ్ జారీ చేసినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. దీంతో పాటు సోషల్ మీడియా వేదికల్లో మహిళలు, చిన్నారుల హక్కులకు భంగం కలిగించేలా వారిని అవమానించేలా లేదా చట్టానికి విరుద్ధంగా ఉండే ఎలాంటి కంటెంట్‌నైనా తక్షణమే తొలగించేలా మెటా కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ అత్యున్నత స్థాయిలో ఆదేశించింది. ఒకవేళ తమ ఆదేశాలను, సూచనలను బేఖాతరు చేస్తే ప్రస్తుతం భారత సమాచార సాంకేతిక చట్టం కింద మధ్యవర్తిత్వ డిజిటల్ సంస్థలకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' లేదా లీగల్ ఇమ్యూనిటీ రక్షణను పూర్తిగా ఉపసంహరించే దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.భారత్‌లో 'సేఫ్ హార్బర్' హోదాను గనుక మెటా కోల్పోతే ఆ సంస్థ ఇక్కడ ఊహించని రీతిలో భారీ న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, థ్రెడ్స్ , మెసెంజర్ వంటి విస్తృత ప్లాట్‌ఫారమ్‌లలో కోట్లాది మంది వినియోగదారులు పోస్ట్ చేసే కంటెంట్‌కు ఆయా సంస్థలకు ఇప్పటివరకు పరిమిత బాధ్యత మాత్రమే ఉండేది. అంటే వినియోగదారుల పోస్టులకు సంస్థను నేరుగా బాధ్యులను చేసే అవకాశం లేదు. అయితే ఈ చట్టపరమైన రక్షణ కవచం తొలగిపోతే ప్లాట్‌ఫారమ్‌లో ప్రత్యక్షమయ్యే ప్రతి అభ్యంతరకరమైన, ఉద్రేకపూరితమైన లేదా చట్టవిరుద్ధమైన పోస్టుకు మెటా యాజమాన్యమే నేరుగా చట్టసభలు, న్యాయస్థానాల ముందు బాధ్యత వహించాల్సి వస్తుంది. అంతేకాకుండా సంస్థ ప్రతినిధులపై నేరుగా క్రిమినల్ కేసులు నమోదు చేసే వీలు కూడా కలుగుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే తెలంగాణ పోలీసులు నమోదు చేసిన వివిధ కేసుల దర్యాప్తు పురోగతిపై కూడా ఈ పరిణామం గణనీయమైన ప్రభావం చూపే అవకాశముంది.

ఈ ఉద్రిక్త పరిస్థితుల నడుమ, మెటా ప్రతినిధి బృందం కేంద్ర సమాచార , సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో అత్యవసరంగా సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీలో వివాదాస్పద అంశానికి సంబంధించి సంస్థ వైఖరిని, భవిష్యత్తులో తీసుకోబోయే సాంకేతిక నియంత్రణ చర్యలను వివరించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మెటా ఇచ్చిన వివరణలతో పార్లమెంటరీ కమిటీ కానీ, ప్రభుత్వం కానీ సంతృప్తి చెందకపోవడంతో జుకర్‌బర్గ్ నుంచి నేరుగా బహిరంగ క్షమాపణ రావాల్సిందేనన్న కఠిన డిమాండ్‌పై కేంద్రం ఇప్పటికీ నిలకడగా ఉంది. రాబోయే రోజుల్లో ఈ పరిణామాలు భారత్‌లో గ్లోబల్ టెక్ దిగ్గజాల బాధ్యతను, డిజిటల్ కంటెంట్ నియంత్రణను, సేఫ్ హార్బర్ రక్షణ అంశాలను కొత్త మలుపు తిప్పే అవకాశముంది.

## వారు జనంతో ఆడుకున్నారు.. సింధు అకాడమీ ప్రారంభోత్సవంలో లోకేష్



వైసీపీ హయాంలో -ఆడుదాం ఆంధ్ర- పేరుతో ప్రజల సొమ్మును దోచేశారని మంత్రి లోకేష్ అన్నారు. జనంతో ఆడుకున్నారని విమర్శించారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. ప్రజలకు క్రీడలపై ఆసక్తి పెంచుతున్నామని.. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులకు అండగా ఉంటున్నామని చెప్పారు. ఒకవైపు విద్యారంగం.. మరోవైపు క్రీడారంగం రెండింటినీ సమపాళ్లలో ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు.స్టార్ షట్లర్.. పీవీ సింధు విశాఖపట్నంలో నిర్మించనున్న క్రీడా ప్రాంగణానికి బుధవారం మంత్రి లోకేష్ భూమి పూజ చేశారు. ఇటీవల ఇక్కడ క్రీడా ప్రాంగణం, హాస్టల్ వసతి సహా.. అన్ని రకాల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో -పీవీ సింధు అకాడమీ- నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ మంత్రి లోకేష్ చేతుల మీదుగా నిర్వహించారు. తొలుత మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన మైదానాలను ఏర్పాటు చేస్తోందన్నారు.

పాఠశాల విద్య నుంచే క్రీడలపై ఆసక్తి పెరిగేలా ప్రోత్సహి స్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన కిట్లు నాసిరకంగా ఉండడంతోపాటు.. ప్రజల ధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం విద్యార్థులకు కిట్లను అందించడంతోపాటు.. ప్రముఖ క్రీడాకారులతో శిక్షణ కూడా ఇప్పించనున్నట్టు చెప్పారు.

ఈ సమయంలో పీవీ సింధుపై ప్రశంసలు గుప్పించారు. ఇటీవల జపాన్ టైటిల్ నెగ్గి దేశంలోనే మేలైన క్రీడాకారిణిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. అనంతరం పీవీ సింధు మాట్లాడుతూ.. విశాఖలో నిర్మిస్తున్న క్రీడా భవనానికి ప్రభుత్వం ఎంతో సహకరించిందని తెలిపారు. అధికారులు సైతం తమకు ఎంతో సహకారం అందించారని పేర్కొన్నారు. దీనిని అత్యాధునిక వసతులతో నిర్మించనున్నట్టు తెలిపారు.

# పాక్‌తో రెండో టెస్ట్.. విండీస్‌కు భారీ ఎదురుదెబ్బ

పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు బ్యాటర్ బ్రాండన్ కింగ్ గాయం కారణంగా మ్యాచ్‌లో మిగిలిన భాగానికి దూరమయ్యాడు. ఆగస్టు 4న మూడో రోజు ఆట సందర్భంగా అతడికి తీవ్ర లోయర్ బ్యాక్ మసిల్ స్పాసమ్స్ వచ్చాయి.
పాక్ ఇన్నింగ్స్‌లో 75వ ఓవర్ సందర్భంగా బాబర్ ఆజమ్ రనౌట్‌లో కింగ్ కీలక పాత్ర పోషించాడు. బాబర్ సింగిల్ కోసం ప్రయత్నించగా, తిరిగి క్రీజులోకి రావాల్సి వచ్చింది. ఆ సమయంలో కవర్ ప్రాంతం నుంచి కింగ్ విసిరిన బంతి నేరుగా వికెట్లను తాకడంతో బాబర్ రనౌట్ అయ్యాడు.
అయితే ఈ అద్భుతమైన ఫీల్డింగ్ ప్రయత్నం కింగ్‌కు తీవ్ర గాయాన్ని మిగిల్చింది. బంతిని అందుకుని డైరెక్ట్ త్రో వేసే సమయంలో అతడు ఇబ్బందికరంగా ల్యాండ్ కావడంతో వెన్ను కండరాల్లో తీవ్ర నొప్పి వచ్చింది. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో అతడిని స్ట్రెచర్‌పై మైదానం నుంచి బయటకు తీసుకెళ్లారు. క్రికెట్ వెస్టిండీస్ వైద్య బృందం ప్రాథమిక పరీక్షల అనంతరం కింగ్‌కు లోయర్ బ్యాక్ మసిల్ స్పాసమ్స్ ఉన్నట్లు నిర్ధారించింది. వైద్య బృందం అతడిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. గాయం మరింత తీవ్రం కాకూడదనే ఉద్దేశంతో మిగిలిన మ్యాచ్‌కు అతడిని దూరంగా ఉంచారు. కింగ్ తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులు చేశాడు. అతడి గైర్హాజరీ వెస్టిండీస్ బ్యాటింగ్ కూర్పుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో అతడు బ్యాటింగ్‌కు రాలేదు. కింగ్ లేని లోటు ఈ మ్యాచ్‌లో విండీస్ గెలుపోటములను శాశించే స్థితిలో ఉంది. ఆట నాలుగో రోజు



విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో ఘోరంగా పతనమైంది. తొలి సెషన్ సమయానికి ఆ జట్టు 7 వికెట్లు కోల్పోయి 115 పరుగులు మాత్రమే చేసింది. జస్టిన్ గ్రీవ్స్ (3), షమార్ జోసఫ్ (9) క్రీజ్‌లో ఉన్నారు. మరో రెండు వికెట్లు పడితే విండీస్ ఇన్నింగ్స్ ముగుస్తుంది. సాజిద్ ఖాన్ (4 వికెట్లు), అలీ ఉస్మాన్ (3 వికెట్లు) విండీస్‌ను ఘోరంగా దెబ్బతీశారు. ప్రస్తుతం విండీస్ కేవలం 72 పరుగుల లీడ్‌లో ఉంది. ఈ మ్యాచ్‌లో విండీస్ ఓటమి తప్పించుకోవాలంటే ఏదైనా మహాద్భుతమే జరగాలి. రెండు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో తొలి టెస్ట్ గెలవడంతో విండీస్ 1-0 ఆధిక్యంలో ఉంది.


## చరిత్ర సృష్టించిన మిచెల్ మార్ష్.. తొలి క్రికెటర్



ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సన్‌రైజర్స్ ఫ్రాంచైజీలకు (మూడు జట్లకు) ప్రాతినిధ్యం వహించిన తొలి క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. మార్ష్ ఇప్పటికే ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున.. ఇంగ్లండ్‌లో జరిగే ది హండ్రెడ్ టోర్నీలో సన్‌రైజర్స్ లీడ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. తాజాగా అతను దక్షిణాఫ్రికా టీ20 లీగ్ సా20లోకి కూడా అడుగుపెట్టాడు. సీజన్-5 కోసం సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ అతడిని జట్టులోకి తీసుకుంది. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్, సన్‌రైజర్స్ లీడ్స్, సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్.. ఈ మూడు గ్లోబల్ ఫ్రాంచైజీలకు ఆడిన తొలి ఆటగాడిగా మారాడు. కాగా, సా20 2027 సీజన్‌కు సంబంధించి ఆరు ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్లు, ప్రీ-ఆక్షన్ సైనింగ్‌లను ఖరారు చేశాయి. చాలామంది స్టార్ ప్లేయర్లు ప్రీ-ఆక్షన్ సైనింగ్స్‌లో భాగమయ్యారు. దర్బన్ సూపర్ జెయింట్స్ సామ్ కర్రన్‌తో, జోబర్గ్ సూపర్ కింగ్స్ జేసన్ హోల్డర్‌తో, ఎంఐ కేప్‌టౌన్ విల్ జాక్స్‌తో, పార్ల్ రాయల్స్ జో రూట్‌తో, ప్రిటోరియా క్యాపిటల్స్ ఫిల్ సాల్ట్‌తో ఒప్పందాలు చేసుకున్నాయి.

స్పోర్ట్స్

## చీఫ్ సెలక్టర్‌గా లక్ష్మణ్?



భారత కొత్త చీఫ్ సెలక్టర్‌గా బ్యాటింగ్ దిగ్గజం వీవీఎస్ లక్ష్మణ్ నియమితుడు కానున్నట్లు ఊహాగానాలు సాగుతున్నాయి. సెలక్షన్ కమిటీ ప్రస్తుత ఛైర్మన్ అజిత్ అగార్కర్ పదవీకాలం వచ్చే నెలలో ముగియనుంది. అతడికి పొడిగింపు లభించే అవకాశం కనిపించట్లేదు. అగార్కర్ స్థానంలో లక్ష్మణ్‌కు బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. లక్ష్మణ్ ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతిగా ఉన్నాడు. అతడు 2021లో ఈ హోదాలో నియమితుడయ్యాడు. కోచింగ్ బృందం పనిభార నిర్వహణలో భాగంగా కొన్నిసార్లు టీమ్‌ఇండియా తాత్కాలిక కోచ్‌గా కూడా పనిచేశాడు. ఇటీవల జింబాబ్వే పర్యటనకు కూడా జట్టుతో పాటు కోచ్‌గా వెళ్లింది లక్ష్మణే. ఈ ఏడాది సెప్టెంబరు అక్టోబరులో జపాన్‌లో జరిగే ఆసియా గేమ్స్‌లో పోటీపడే భారత జట్టుకు కూడా అతడు కోచ్‌గా నియమితుడయ్యాడు. ఏ పదవిలో ఉన్నా లక్ష్మణ్ ఆటగాళ్లతో మంచి సంబంధాలు నెరుపుతాడని పేరుంది. ఆటగాడిగా ఉన్నపుడు, ఆ తర్వాత లక్ష్మణ్ వివాదరహితుడే. ఇలాంటి వ్యక్తి చీఫ్ సెలక్టర్ అయితే.. పారదర్శక నిర్ణయాలు తీసుకుంటాడని, అది భారత క్రికెట్‌కు ఎంతో ఉపకరిస్తుందని బీసీసీఐ అధికారులు భావిస్తున్నారు. సెప్టెంబరులో జరిగే బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం సందర్భంగా చీఫ్ సెలక్టర్ నియామకంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది. నిజానికి అగార్కర్ పదవీకాలం ఈ ఏడాది జూన్‌లోనే ముగిసింది. కానీ మూడు నెలల పొడిగింపు ఇచ్చారు. ఈసారి మాత్రం అతడు దిగిపోక తప్పేలా లేదు. అగార్కర్ 2023 జులై నుంచి సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా ఉంటున్నాడు. చేతన్ శర్మ స్థానంలో అతడు బాధ్యతలు అందుకున్నాడు. అగార్కర్ నేతృత్వంలో ఎంపిక చేసిన భారత జట్లు రెండు టీ20 ప్రపంచకప్‌లు, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచాయి. అతడి హయాంలోనే సెలక్షన్ కమిటీ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంది. కోహ్లి, రోహిత్‌లను టెస్టు రిటైర్మెంట్ నిర్ణయాల దిశగా ఒత్తిడి చేసిందనే విమర్శలు ఎదుర్కొంది. ఫాస్ట్‌బౌలర్ షమిని తప్పించి మళ్లీ అవకాశాలు ఇవ్వకపోవడం, ఫామ్ చాటుకున్నప్పటికీ భువనేశ్వర్‌కు తిరిగి జట్టులో చోటివ్వకపోవడం.. టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను టీ20 ప్రపంచకప్ జట్టు నుంచి తప్పించడం లాంటి నిర్ణయాలు చర్చనీయాంశం అయ్యాయి.

# ప్రేమమ్.. రామాయణం.. ఎంత తేడా?



దక్షిణాది సినిమాల్లో చాలా తక్కువ సమయంలో గొప్ప పెర్ఫామర్‌గా పేరు సంపాదించి కల్ట్ ఫాలోయింగ్ తెచ్చుకున్న కథానాయిక.. సాయిపల్లవి. తొలి సినిమా 'ప్రేమమ్'తోనే ఆమె ఎలాంటి ముద్ర వేసిందో తెలిసిందే. అందులో నటించిన అనుపమ పరమేశ్వరన్, మడోన్నా సెబాస్టియన్ తనకంటే అందంగా ఉంటారు. కానీ ఆ సినిమాలో వాళ్లను మించి హైలైట్ అయింది, అందరి దృష్టినీ తన వైపు తిప్పుకుంది సాయిపల్లవినే. ఆమె ఆ సినిమాతో ఏ స్థాయిలో ఫాలోయింగ్ సంపాదించిందంటే.. తెలుగులో తన పాత్రను శ్రుతి హాసన్‌కు ఎంపికైనపుడు తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అప్పటికే పెద్ద స్టార్ అయిన శ్రుతిని ఈ పాత్ర కోసం తీసుకుంటే.. ఒరిజినల్ చూసిన వాళ్లకు అది రుచించలేదు. తెలుగులో కూడా సాయిపల్లవినే ఆ పాత్ర చేయాలని డిమాండ్ చేశారు. ఐతే రీమేక్‌లో నటించడం ఇష్టం లేక ఆ సినిమా చేయని సాయిపల్లవి.. ఆ తర్వాత నేరుగా 'ఫిదా' సినిమా చేసి ఎంత మంచి గుర్తింపు సంపాదించిందో.. తెలుగుతో పాటు తమిళంలోనూ ఎలా ఎదిగిందో తెలిసిందే. తాను చేసే ఏ పాత్రకైనా ఒక ప్రత్యేకతను తీసుకొస్తుందని.. ఆ పాత్ర బలం పెంచుతుందని సాయిపల్లవికి ఒక పేరుంది. అలాంటిది కెరీర్లో తొలిసారిగా ఒక పాత్రకు ఆమె సూట్ కాలేదంటూ విమర్శలు రావడం ఆశ్చర్యం కలిగించే విషయం. 'రామాయణ'లో సీత పాత్ర విషయంలో ఇలాంటి వ్యతిరేకతనే ఎదుర్కొంటోంది సాయిపల్లవి. ఈ పాత్రకు సాయిపల్లవిని ఎంపిక చేసినపుడు అందరూ సైలెంటుగానే ఉన్నారు కానీ.. తర్వాత నెమ్మదిగా అభిప్రాయం మారుతూ వస్తోంది. ఇప్పుడు ట్రైలర్ లాంచ్ అయ్యాక విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటోంది సాయిపల్లవి. నార్త్ ఇండియన్ ఆడియన్స్ అయితే సీతగా సాయిపల్లవిని అస్సలు అంగీకరించడం లేదు. సౌత్ వాళ్లలో కూడా భిన్నాభిప్రాయాలు కనిపిస్తున్నాయి. సాయిపల్లవి గొప్ప నటి అయినా.. సీత పాత్రకు అవసరమైన డివైనిటీ తనలో కనిపించడం లేదని.. ట్రైలర్లో తన హావభావాలు, డైలాగ్ డెలివరీ కూడా బాగా లేవని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఐతే గతంలో ఒక ఇంటర్వ్యూలో భాగంగా మనకు మన సైన్యం గొప్ప అన్నట్లే, పాకిస్థాన్ వాళ్లకు వాళ్ల సైన్యం గొప్ప కదా అంటూ సాయిపల్లవి చేసిన ఒక కామెంట్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అప్పుడు ఆమె మీద యాంటీ నేషనల్ ముద్ర వేసి అప్పటి నుంచి ఒక వర్గం ఆమెను టార్గెట్ చేస్తోందని, ఇప్పుడు కూడా ఆ వర్గమే ఆమె మీద నెగెటివిటీని స్ప్రెడ్ చేస్తోందని.. సినిమా రిలీజయ్యాక తన మీద నెలకొన్న సందేహాలన్నింటికీ సాయిపల్లవి సమాధానం చెబుతుందని ఆమె మద్దతుదారులు అభిప్రాయపడుతున్నారు.



ఆమ్నా షరీఫ్ మనోహరమైన భంగిమలు



బీచ్‌లో పూజా భాలేకర్ లుక్స్ దవడ పడిపోయాయి

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com